తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

12-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 253 పేజీలు: 16 వెల: 6.50




**SHOWROOMS: ANDHRA PRADESH:** RENAULT **SRIKAKULAM** Ph: 8448481380. RENAULT **VIZAG** Ph: 8527240397.

12-10Pg3exHMNWJQE.qxd OK:12-10Pg3exHMNWJQE.qxd 1/1/02 7:07 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
12-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 253 పేజీలు: 16 వెల: 6.50

డ్వాక్రా ఉత్పత్తులకు ఒకే బ్రాండ్ : సిఎం 5
విజయవాడ ఉత్సవాలు షురూ!

## సమాకారం, ప్రోత్సాహం, సద్భావనతోనే
# దేశాభివృద్ధి సాధ్యం

**మహారాజా అగ్రసేన్ 5150 జయంతి మహోత్సవంలో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా**

**నిజమైన సామ్యవాదానికి మహారాజా అగ్రసేన్ ప్రతీక: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ఉత్పత్తి, అభివృద్ధి, సంపద సృష్టిలో వైశ్ సమాజం కీలకం: డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**

**వేడుకలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు విహెచ్ ప్రభృతులు**

**హైదరాబాద్, (జూబ్లీహిల్స్), అక్టోబరు 11, ప్రభాతవార్త:** త్యాగం, కరుణ, శాంతి, సమానత్వానికి మహారాజా అగ్రసేన్ ప్రతీకగా నిలిచిన మహారాజా అగ్రసేన్ 5150వ జయంతి మహోత్సవాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 92లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిధిగా పాల్గొని మహారాజా అగ్రసేన్ ధామ్‌ను ప్రారంభించారు. అఖిల భారత

>>2



మహారాజా అగ్రసేన్ 5150 జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, చిత్రంలో అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ



శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు
## శాస్త్రోక్తంగా అంకురార్పణ

**తిరుమల, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అంగరంగ వైభవంగా జరగనున్న శ్రీవారి నవ రాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి విష్వక్సేనులు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. విత్తనాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. ఉత్స వాలు విజయవంతం కావాలని సంకల్పించ డంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొంద డమే ఈ ఘట్టంఉద్దేశం. సూర్యుడు అస్తమించిన తరువాతే అంకురార్పణ నిర్వహిస్తారు. జ్యోతిష శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం చంద్రుడిని సస్యకారక అంటారు. ఈ కారణంగా పగటివేళ అంకురాలను ఆరోపింపచేయడం తగదు. సాయంత్రం వేళ మంచి ముహూర్తంలో అంకురార్పణ నిర్వహిస్తారు. అంకురార్పణంలో పలు పవిత్ర విత్తనాలునాటడం తెలిసిందే. అంకు రార్పణంలోనాటే విత్తనాలు

>>2

# పేదలకు భద్రత కల్పిస్తాం

## ఆత్మగౌరవం, ఆస్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

- వర్చువల్‌గా నెల్లూరులో సర్వేపల్లి కట్ట ఇళ్ల పట్టాల పంపిణీని ప్రారంభించిన సిఎం చంద్రబాబు
- రూ.600 కోట్ల విలువైన 22.31 ఎకరాల భూమిపై పేదలకు హక్కులు
- 701 మంది మహిళల పేరిట పట్టాలు.. మహిళా సాధికారతకు పెద్దపీట
- వచ్చే సంక్రాంతిలోగా నెల్లూరులో మరో 4,000 ఇళ్ల పట్టాల పంపిణీకి ఆదేశం

**నెల్లూరు (వైద్యం), అక్టోబరు 11 ప్రభాతవార్త:** దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ, వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నెల్లూరులోని సర్వేపల్లి కట్టలో 22.31 ఎకరాల భూమిపై 939 కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం అమరావతిలోని క్యాంప్ ఆఫీస్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. సుమారు రూ.600 కోట్ల విలువైన ఆస్తిపై పేదలకు హక్కులు కల్పించామని తెలిపారు. మొత్తం లబ్ధిదారుల్లో 701 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేసి, ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉప ముఖ్యమంత్రి



పవన్ కల్యాణ్‌తో కలిసి పేదలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం 28 నెలల పాలనలో ఆచరణలో చూపిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు సుపరిపాలనకు నాంది పలికామని, పేద కుటుంబాలకు శాశ్వతఇళ్లపట్టాలు పంపిణీ చేయడం సుపరిపాలనలో భాగమని చెప్పారు. పేదల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.

**పేదలకు భద్రత, ఆత్మగౌరవం, శాశ్వత ఆస్తి:** ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు భద్రత కల్పించడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉద్యమంలా పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి ప్రాంతాల్లో 60 వేల కుటుంబాలకు రూ.52,000 కోట్ల విలువైన ఆస్తిని ఇళ్ల పట్టాల రూపంలో అందించామని వెల్లడించారు. "ప్రతి ఒక్కరికి భద్రత, ఆత్మగౌరవం, ఒక ఆస్తి సమకూరాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష ్యం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో పట్టాలు పొందేందుకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా ఎలాంటి అవకతవకలు లేకుండా పేదలకు పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగరంలో ఇప్పటి వరకు

>>2

'స్థానికి్ష పట్టు సాధించాలి: సిఎం 5లో



ఆదివారం కాకవాడ సభలో గిరిజనులతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

# గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

**పోలవరం జిల్లా కాకవాడలో 'అడవితల్లి బాట 2.0'కు శ్రీకారం**

**రూ.2,052 కోట్లతో మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం**

**గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**కాకవాడ సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టీకరణ**

**గిరిజనులతో మమేకమై, సమస్యలు విని పరిష్కారానికి ఆదేశాలు**

**పోలవరం జిల్లా ప్రతినిధి, అక్టోబరు 11 ప్రభాత వార్త:** మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి గిరినులను అభివృద్ధి చేయటమే లక్ష ్యంగా 'అడవి తల్లి బాట 2.0'కు శ్రీకారం చుట్టినట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమంలో భాగంగా పోలవరం జిల్లా రంపచోడవరం మండలం కాకవాడలో ఆదివారం పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి అక్కడి గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుకున్నారు. గిరిజనులు తయారు చేసిన వెదురు ఉత్పత్తులను చూసి పవన్ కల్యాణ్ మంత్ర ముగ్ధులయ్యారు. వెదురు ఉత్పత్తులు తయారు చేస్తున్న తమకు వాటిని మార్కెట్ చేసుకోవటానికి సరైన రహదారి సౌకర్యం లేదని గ్రామస్తులు ఉపముఖ్యమంత్రికి తమ గోడు వెళ్ళబుచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన ఆవాసాలకు రహదారులు, విద్య, వైద్యం, ఉపాధికి పెద్దపీట వేస్తుందని ప్రకటించారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష ్యంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రూ.2,052 కోట్లతో 2,569 అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ప్రకటించారు.

>>5



బాలాత్రిపురసుందరిగా
## దుర్గమ్మ దర్శనం

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 11, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో మొదటిరోజు ఆదివారం దసరాఉత్సవాల్లో శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మవారు భక్తులను కటాక్షించారు. బాల స్వరూపంలో దుర్గమ్మ వారిని పూజిస్తే మనో, వాక్కాయ, కర్మలన్నీ శుద్ధసత్వ గుణాన్ని సంతరించుకుని మోక్ష జ్ఞానం సులభంగా అందుతుంది. దుర్గమ్మ వారిని శరన్నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు ఆదివారం బాలా త్రిపుర సుందరీ దేవిగా 1,02,434 మంది భక్తులు దర్శించుకున్నారు. దసరా ఉత్సవాల్లో మొదటి రోజు ఆదివారం ఉదయం శ్రీ దుర్గమ్మవారికి స్నపన తిరుమంజనం తదితర పూజాదికాలు నిర్వహించిన అనంతరం ఉదయం 8 గంటల నుండి భక్తులను దర్శనానికి

>>2

# యువతకు శిక్షణతో ఉద్యోగ, ఉపాధి

**సీడాప్ ద్వారా యేటా లక్ష మందికి ఉపాధి కల్పన లక్ష్యం**

**పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌ను సమర్ధవంతంగా వినియోగించుకోవాలి**

**నైపుణ్య విభాగం కింద ఇప్పటివరకు 5.43 లక్షల మందికి ఉద్యోగాలు**

**నైపుణ్యాభివృద్ధి విభాగంపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ**



ఆదివారం నైపుణ్యాభివృద్ధి విభాగంపై సమీక్ష జరుపుతున్న మంత్రి నారా లోకేష్

**అమరావతి, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున చేపడుతున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల సమర్థ అమలు ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి విభాగం ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా యువతకు ఎపిఎస్ఎస్‌డిసి ద్వారా చేపడుతున్న వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమలుతీరు, ప్రగతిని అధికారులు

>>2

# సారీ.. ఆ అధికారం మాకు లేదు

**ఆ అంశాలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ**

**అభ్యంతరాలుంటే మరో పిటీషన్ దాఖలు చేయొచ్చు**

**కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌కు సిజెఐ సూచన**

**ప్రతిపక్ష నేతల భేటీకి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరణ**



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ఎన్నికల అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమికి భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌ను కలిసేందుకు అనుమతి లభించలేదు. ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి, సిజెఐకి వినతిపత్రం సమర్పించాలని ప్రతిపక్షాలు నిర్ణయించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. భేటీ కోసం చేసిన అభ్యర్థనకు స్పందించిన సిజెఐ, వారు లేవనెత్తాలనుకుంటున్న అంశాలు ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నాయని, అందువల్ల పిటిషన్ దాఖలు చేయాలని సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధి బృందాన్ని ఈ విధంగా పరిపాలనా స్థాయిలో కలిసే అధికారం న్యాయస్థానానికి లేదని సిజెఐ స్పష్టం

>>2

# సుప్రీం మార్చ్‌కు రండి

- జ్ఞానేశ్ రాజీనామా చేసేదాకా వదలం, ఓట్ల చోరీని అరికట్టాల్సిందే: రాహుల్
- ఆగని నిరసనలు.. కొనసాగిన అరెస్టులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ఓట్ల చోరీ జరుగుతోందన్న ఆరోపణలకు నిరసనగా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలోని సుప్రీంకోర్టు వరకు మార్చ్‌లో పాల్గొనాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం పౌరులకు, ప్రతిపక్ష పార్టీలకు, యువతకు, పౌర సమాజ సంఘాలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, తాను, రాహుల్ గాంధీ సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసి తమ ఆందోళనలను వివరించనున్నట్లు తెలిపారు. ఈవ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, నిరసనకారులపై పోలీసుల దాడులు, ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవడంపై ఢిల్లీలో నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో రాహుల్ ఈప్రకటన చేసారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విడుదల చేసిన వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశం తరపున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తామని, రాజకీయ పార్టీలు, లింగం, కులం, మతం, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మనం భారతీయులుగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహిస్తాం. పార్టీ, లింగం, కులం, సమాజం, రాష్ట్రం అనే భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగుదామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో శాంతియుతంగా సమావేశమైన యువకులపై పోలీసులు, బిజెపి కార్యకర్తలు దాడి చేశారని ఆయన ఆరోపించారు. వారిహృదయాల్లో ద్వేషం, కోపంలేవు. ప్రేమతో వచ్చారు. కానీ పోలీసులు, బీజేపీ గూండాలు వారిని కొట్టారని వ్యాఖ్యానించారు. మనం కోరుకునే భారతదేశం ఇది కాదని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే వారు, భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నవారుఅందరూ ఈమార్చ్‌లో పాల్గొనాలని కోరారు. యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సంఘాలు తమతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి

>>2

## స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం ఉత్తర్వులు

**సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్' ఆధారంగా కేటాయింపు**

**పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిఒ జారీ**

**విజయవాడ, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** పట్టణ స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తించేలా జిఒ జారీ చేసింది. బిసి రిజర్వేషన్ల ఖరారులో ప్రత్యేక కమిషన్ సిఫార్సులకు ఆమోదం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్లు కలిపి 50శాతానికి మించకూడదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు, ఎపి హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయనుంది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఎస్‌జిఎస్‌డబ్ల్యు డేటా ఆధారంగా పట్టణాల్లో బిసి రిజర్వేషన్ల నిర్ణయం తీసుకుంది. ఎస్టీ, ఎస్సీ, బిసి వర్గాల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల స్థానాలకు రొటేషన్

>>2



# వంటింట్లో ధరల మంటలు!

## ఆకాశాన్నంటిన నిత్యావసరాలు

- నోటికందని బియ్యం, నూనెలు
- చేదెక్కుతున్న చక్కెర, చేజారుతున్న కూరగాయలు
- ఖరీఫ్, రబీలను మింగేస్తున్న ఎల్‌నినో
- అంతటా ముంచుకొస్తున్న ఆహార సంక్షోభం

**పుణె, అక్టోబరు 11:** అభివృద్ధి చెందుతున్న సూపర్ ఎల్ నినో, ఈ యేడాది వర్షాకాలం తర్వాత కూడా పంట ఉత్పత్తికి అంతరాయం కలిగించి, సరఫరాను తగ్గించి, ఆహార ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉన్నందున, 2027లో సంభవించే సరఫరా సంక్షోభం గురించి భారత ఆహార పరిశ్రమ హెచ్చరిస్తోంది. పప్పుధాన్యాల ధరలను నిర్ణయించడంలో రబీ శనగ పంట కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, "రాబోయే కొద్ది నెలల గురించి మేము అంతగా ఆందోళన చెందడం లేదు. మాకు ఆందోళన కలిగిస్తున్నది వచ్చే యేడాది 2027 గురించే అని ఇండియన్ పల్సెస్ అండ్ గ్రైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

>>2

12-10pg4.qxd:12-10pg4.qxd 1/1/02 6:58 AM Page 1



వార్త

ఒకే శత్రువుతో అనేకసార్లు యుద్ధం చేయవద్దు. అలా చేస్తే నీ యుద్ధకళలన్నీ అతనికి నేర్పుతావు.

న- నెపోలియన్ బోనపార్టే

# పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ట!

పంచభూతాలను రక్షించుకోవడం మానవ మను గడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించిన సంగతి మన పురాణాలు మనకు ప్రస్ఫుటంగా చెబుతున్నాయి. అయినా మనం వాటి ప్రాధాన్యతలను గుర్తించకపోవడమే అసలుసిసలైన లోపం. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవతా స్వరూపంగానే భావించారు. అందుకే నదులను జీవన దాయిని, మాతృ మూర్తులుగా భావిస్తున్నాము. ప్రాచీన సంస్కృతి, నాగరి కతలు నదీతీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగుతున్నాయి. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ మనపరిసరాలనూ, చెట్టూ పుట్టా, గాలీ నీరు, కొండా కోనా వాగూ వంకా, చిలుకా పిచికా, అన్నిటినీ రక్షించు కోవడమే మూలంగా సాగేవి. ఇప్పుడా ఊసేలేదు. ఇప్ప టికీ పాలపిట్ట దర్శనం గురించి విస్తృత ప్రచారంలో ఉంటుంది. అవి క్రమేపీ అంతరించిపోతున్నాయని చెప్పు కుంటున్నాం. ఇలా జంతు వృక్షజాతులు మాయమౌతు న్నాయి. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీస్తున్నామని అనుకోలేకపోతున్నాం. పైగామనకెందు కులే అనే ధోరణి ప్రబలిపోతోంది. ఏది ఎలా విధ్వంసం జరిగినా వాటిని కాపాడుకునే ఆలోచన చేయడం లేదు. మరో పక్క పాలకుల విధ్వంసకర విధానాలవల్ల దేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడంలేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమించకపోవ డం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. పెరుగుతున్న జనాభే పర్యావరణవిధ్వం సానికి మొదటి చేటుగా గుర్తించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను, మట్టిని తోడేస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నా రు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేకపోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జనా వాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పర్యావరణంలో జీవ నానికి హాని కలి గించే భౌతిక, రసాయనిక, జీవ సం బంధమైనపదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగవుతున్నా దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభ విస్తోంది. అందుకే నేడు ఈపర్యావరణానికి నష్టం వాటి ల్లుతోంది. దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, మకర సంక్రాంతి, జన్మాష్టమి. శ్రీ రామనవమి వంటిపర్వ దినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్ప తనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియచేస్తున్నాయి. భూ గోళంపై 80 శాతం జలం విస్తరించి ఉంది. అయినప్ప టికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరుదొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధ జలం మానవ చర్యలవల్ల పనికిరాకుండాపోతోంది. దీని వల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భ జల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే సాగుకు, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరి శుభ్రంగా ఉంచడం మనందరి నైతికబాధ్యత. గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు. నివాస ప్రాంతాలనుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలు కూడా వారి దారిలోనే యధారాజా తథాప్రజా! అన్నట్లుంది. పర్యవసానంగా దేశంలో ఉన్నప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలు గా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పం చెప్పుకోవలసి ఉంది. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్యఉత్ప న్నమవుతోంది. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యంపెరిగి పోతోంది. మానవప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. తనకు ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని మనిషే నాశనం చేస్తున్నాడు. గృహవ్యర్థాలు, చెత్తా చెదా రం వల్ల భూసారం దెబ్బతింటోంది. మన దేశంలో ప్రతిరోజూ లక్షాదెబ్బై వేలటన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకుభూమిలో నాశనం కాకుండా నిల్వఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశు



మోక్షం అంటే నిష్క్రియలో స్వేచ్ఛ కాదు. క్రియాశీలతలో స్వేచ్ఛ కలిగి ఉండడమే మోక్షం.

స్వామి చిన్మయానంద



మూర్ఖుల పట్ల కృతజ్ఞతగా ఉండాలి తప్ప, వాళ్లతో పోటీ పడకూడదు.

మార్క్ ట్వైన్

# జల కాలుష్యంలోనే గోదావరి 'పుష్కరం'

*గోదావరినిత్యం ప్రవహించేది అయినా, వర్షాధారితం, గంగా యమునా ప్రణాళికలు ఇక్కడ పనిచేయకపోవచ్చు. సముద్రతీర ప్రాంతం సమీపంలో ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ప్రసాదించిన అద్భుతవరం. కాకినాడ ఉప్పాడ ప్రాంతానికో, ధవళేశ్వరం సముద్ర తీరానికో ప్రత్యేక కాల్వల ద్వారా, లేదా భారీ గొట్టాల ద్వారా వ్యర్థపారిశ్రామిక, నగర, స్మశాన, చాకి రేవుల ఇతరత్రా కాలుష్య జలాలను గోదావరిలోకి వెళ్లకుండా సముద్రజలాలలోకి తరలించే భగీరథ ప్రయత్నం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు రానున్న పుష్కర సందర్భాన్ని కేంద్రానికి సమయ విజ్ఞతతో గుర్తు చేసే సదవకాశంగా చేపట్టాలి. వేదంలా ఘోషించే, పవిత్ర గోదావరి సజీవ రమణీయతను 2027 పుష్కర ప్రవేశంలో ఇహ, పరాలుగా ఆరాధ్యనీయం చేసుకోగలమా?*

మహారాష్ట్రుల కూతురుగా, తెలుగు వారి కోడలిగా బంగారు తెలంగాణ రాష్ట్రసీమలో పాదం మోపి, స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు పరుగులు తీస్తున్న గోదావరి ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల జనావళి ఐహిక, ఆముష్మిక కలల సాఫల్యానికి గుండెలలో గుడికట్టుకుంది. తెలంగాణ రాష్ట్రం లోని అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నదీ తీరాలలో రెండు తెలుగు రాష్ట్రాల సంపన్న, సౌభాగ్య ప్రదాయినిగా గోదావరి కదులుతోంది. గోదావరి, కృష్ణ వంటి జీవనదీ జలాలు ఆకలి, దప్పులు లేకుండా జనాన్ని బతికిస్తున్నాయి. నదుల జలాలను మనం యథేచ్ఛగా వినియోగించుకొంటున్నాం. నిజం చెప్పాలంటే అవసరాలకు మించి దురాశతో కొల్లగొడ్తున్నాం. 'గోదావరీ.. నమోస్తుతే' అంటూ ప్రణుతించమని అనాదిగా, మహాత్మ్య తత్త్వం ప్రబోధిస్తోంది. ప్రకృతితో నిరంతరం తాదాత్మ్యం చెందే మహోన్నత లక్షణాలలో భాగం చెట్టు, పుట్టా, గాలి, నేల, నీరు, నిప్పు మనకు బతుకు ప్రసాదించే దైవత్వభావన ఆరాధనా దృష్టితో సాగిలపడడం మన జీవన ధర్మం. పన్నెండేళ్లకోసారి గోదావరికి, ఆ నదిని పూజించి తరించే ప్రగాఢ విశ్వాసం, పుష్కర పవిత్రత సమకూర్చుతుంది. నదిని తల్లిగా కృతజ్ఞతాపూర్వకంగా ఆరాధించే ఆరాధన, స్వర్గస్థులైన పెద్దలకు, స్మృతికి భక్తిశ్రద్ధలతో తీర్థ విధులు దానవితరణలు, పురాణ ప్రాచీన ఆలయాల సందర్శన నదులు పుట్టినప్పటి నుంచి పుష్కర పవిత్రత కోట్లాది ఆసక్తి భారతీయులను అలరారిస్తోంది. భారతీయ జనతాపార్టీ కేంద్రాధికారం చేపట్టిన తర్వాత భారతీయ ఆధ్యాత్మికతకు, మత ఔన్నత్య జీవన విలువలకు మరింత ప్రాధాన్యత పెరిగింది. ఆధ్యాత్మిక పర్యటనలకు ప్రభుత్వపరంగా ఆదరణ, ప్రోత్సాహం లభిస్తోంది. స్నానఘట్టాలు, దేవాలయాల సుందరీకరణ, పారిశుధ్య నిర్వహణ, యాత్రికులకు రవాణా సౌకర్యాలు, ప్రత్యేక వసతి ఏర్పాట్లు, ప్రత్యేక రైళ్లఏర్పాటు చేయడం పట్లరాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తున్నాయి. కాని గోదావరి, కృష్ణా వంటి నదీజలాల సజీవతను సంరక్షించే దిశగా ప్రభుత్వాలు చర్య తీసుకోవడం లేదు. మహానగరాల కాలుష్యం, నదీ తీరాల పరిశ్రమల కాలుష్యం ఏ స్థాయికి చేరిందంటే, స్నానాల మాట దేవుడెరుగు కనీసం నీళ్లను పుక్కిట పట్టడం కూడా భయపడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. విపరీతజన సమ్మర్దంలో ఒకరినొకరు తోసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆశించేవారికి దురదృష్టవశాత్తు తప్పించుకోలేని ప్రమాదాలలో చిక్కుకొంటామనే ఆలోచన ఆ సమయంలో ఉండదు. వెనక్కి సురక్షితంగా రావటానికి తొక్కిసలాట, ఆందోళన, నిస్సహాయత కారణంగా మరింత తొక్కిడిలో ఇరుక్కుపోయి పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రాణాలు కోల్పోతుంటారు. పవిత్ర స్నానాల కోసం తాపత్రయపడే భక్తులు, పుణ్యం

**జయసూర్య**

కోసం మహూర్తంలోనే స్నానం చేయాలనే మీడియా ద్వారా 144వ సంవత్సరాల పుష్కరపవిత్రత వంటి ప్రచారం గోదావరి పుష్కర 2015 ఆరంభఘట్టాన్ని విషాదమయంచేసింది. కోట్లాదిగా యాత్రికులు తరలి రావాలనే ప్రభుత్వం పిలుపు ఇవ్వడం, ముహూర్త ప్రకటనలు, ప్రభుత్వం పర్యాటక ఆదాయం పెంచుకోవాలనే అత్యాశ, భక్తజనులు ఎదుర్కొనే అధికారుల అనుభవ శూన్యత కారణంగా యాత్రికులు ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. 21వ శతాబ్దంలో తృతీయ దశాబ్దం



లోకి, మూడు సంవత్సరాలలో అడుగుపెట్టనున్న, తెలుగు భక్తజన సందోహానికి 2027 పుష్కర సన్నాహం ప్రచారం ప్రారంభమైంది. మళ్లీ పుష్కరాలకు ఎవరు ఉంటారో, ఎవరు ఉండరో అనే తాత్త్వికచింతన ఉండనే ఉంది. పవిత్ర పుష్కరుడు నదిలో ప్రవేశించే, నదుల వరుసలో గోదావరిఐదవది. బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, రాజమండ్రి, అంతర్వేది కొవ్వూరు, నరసాపురం ఇత్యాది గోదావరీ నదీ తీర క్షేత్రాలలో ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక, ఆధ్యాత్మిక తీర్థవిధులకు ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వం కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఉండటం కారణంగా కోట్లాది ఆస్తికులు యావద్భారతం నుంచే కాక దేశ విదేశాల నుంచి తరలివచ్చే అవకాశాలు ఈ పుష్కరాలకు పుష్కలంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొని ఉన్న కూటమి ప్రభుత్వాధినేతలు, కేంద్రాధిపత్యం కనుసన్నలలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రస్తుతం వ్యవహారశైలి, పూర్వపు ముఖ్యమంత్రిగా, గత పుష్కరాల అనుభవానికి తోడుగా రానున్నపుష్కరాలు 'మహాకుంభమేళాస్థాయిలో ఉత్తరాది పెద్దల దృష్టి ఆకట్టుకోవాలనే సన్నాహం ఆరంభమైంది. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పుష్కరాలు నిర్వహించే అంశం తానే చూసుకొని మోడీజీ కనుసన్నలలో పడటానికి, గోదావరిలో స్వయంగా రాజమండ్రి ప్రాంతంలో పంట్ మీద పయనించి, గోదావరి కాలుష్యం చూసి అవాక్కయ్యారు. పట్టుమని పది నెలల సమయం మాత్రమే ఉంది. రానున్న జూన్ 26 ప్రభుత్వం పుష్కర ఆరంభంగా ప్రకటించింది. దేశమంతటా భక్తజనులు ఉవ్విళ్లూరుతున్నారు. గోదావరీ జలాలు తాగడానికి కాదు. ఔపోసనం పట్టడానికి పనికిరాని పరిస్థితులున్నాయి. ఉప ముఖ్యమంత్రి అత్యుత్సాహం ఉన్నా రాజమండ్రి పుష్కర సన్నాహంలో అతికీలకమైన జలకాలుష్య నివారణ ఆలోచన అటకెక్కింది. పేపర్ మిల్లు కాలుష్యం, కోటి లింగాల స్మశానంలో శవాల బూడిద, నగరంలోని మురికిని మోసే నల్లా కాల్వ కాలుష్యం యథేచ్ఛగా గోదావరిలో కలుస్తోంది. ఆనీళ్లే దిగువ ప్రవాహంలో శుద్ధి చేయబడి మంచినీటిగా మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. గోదావరి అంతా, ప్లాస్టిక్ సహిత వ్యర్థాలతో అత్యంత దుర్గంధం, పక్కకు చేతితో తొలగించుకొని రజకులు మాసిన బట్టల మురికి వదుల్చుకొంటున్నారు. అదీ గోదావరిలోకే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సమర్థుడైన చంద్రబాబు నాయుడు గతంలో పుష్కరాలను అతిఘనంగా నిర్వర్తించిన దీక్షాదక్షుడు. భౌగోళికంగా రాజమహేంద్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక విశిష్టత గుర్తించినముఖ్యమంత్రి రాజమండ్రి కాదు, ఇక రాజమహేంద్రిగా ఆ మహానగరాన్ని నామకరణం చేసే గౌరవం స్వయంగా ఇచ్చారు. గోదావరీ పుష్కరాలకు మారుపేరు రాజమండ్రి పుష్కరాలు. కేంద్రంలో పాలనాధిపత్యంలోని మోడీ ప్రభుత్వం రైల్వే, విమాన యానానికి ఇస్తున్న ప్రాధాన్యత ఇంతా అంతా కాదు. ఉత్తర, దక్షిణ భారత అనుసంధానికి, రైల్వే విమాన యానం అతి వేగం, సురక్షితంగా కేంద్రం ఆదాయంతో పాటు అభివృద్ధి సాధిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రాంతాలకు గోదావరీ జలాలతరలింపు సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరీ నదీమతల్లికి, స్వయంగా నేల మీద సాగిలపడి సాష్టాంగ ప్రమాణం చేయడం యావద్భారత దేశాన్ని కదలించింది. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్థితిగతులలో, గోదావరి పుష్కరాలంటే చట్టుక్కున గుర్తువచ్చేది రాజమహేంద్ర నగరం. ఆ మహానగర సమీపంలోనే ధవళేశ్వరం సమీప బంగాళాఖాతంలో గోదావరి అతి ఉధృత వరద ప్రవాహం ఆ సమయంలో కలుస్తోంది. గోదావరినిత్యం ప్రవహించేది అయినా, వర్షాధారితం, గంగా యమునా ప్రణాళికలు ఇక్కడ పనిచేయకపోవచ్చు. సముద్రతీరప్రాంతం సమీపంలో ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ప్రసాదించిన అద్భుతవరం. కాకినాడ ఉప్పాడ ప్రాంతానికో, ధవళేశ్వరం సముద్ర తీరానికో ప్రత్యేక కాల్వల ద్వారా, లేదా భారీ గొట్టాల ద్వారా వ్యర్థపారిశ్రామిక, నగర, స్మశాన, చాకి రేవుల ఇతరత్రా కాలుష్య జలాలను గోదావరిలోకి వెళ్లకుండా సముద్రజలాలలోకి తరలించే భగీరథ ప్రయత్నం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు రానున్న పుష్కర సందర్భాన్ని కేంద్రానికి సమయ విజ్ఞతతో గుర్తు చేసే సదవకాశంగా చేపట్టాలి. వేదంలా ఘోషించే, పవిత్ర గోదావరి సజీవ రమణీయతను 2027 పుష్కర ప్రవేశంలో ఇహ, పరాలుగా ఆరాధ్యనీయం చేసుకోగలమా?

# ఎన్నికల వ్యవస్థపై పటిష్టమైన విశ్వాసం అవసరం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం రాజకీయ ప్రక్రియ కాదు. అవి ప్రజల విశ్వాసానికి ప్రతిబింబం. ఓటరు తన ఓటు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకుంటాడు, పాలనను ప్రభావితం చేస్తాడు, అధికారాన్ని జవాబుదారీతనానికి లోబరుస్తాడు. అందుకే ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం బలహీనపడితే ప్రజాస్వామ్య పునాదులే కదిలే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చుట్టూ జరుగుతున్న చర్చలు ఎన్నికల పారదర్శకత, సమగ్రత, విశ్వసనీయతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి సుమారు 96 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉండటం దేశ ఎన్నికల వ్యవస్థ విస్తృతిని ప్రతిబింబిస్తోంది. ఇంత భారీ స్థాయిలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక విశేషమైన ఘట్టం. అయితే ఎన్నికలపై ప్రజలవిశ్వాసం కేవలం పోలింగ్ రోజుమాత్రమే కాకుండా, ఓటరు జాబితాల తయారీ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో నెలకొనాలి. ప్రస్తుతం ప్రధాన చర్చకు కారణమైన ఎస్ఐఆర్ గణాంకాలు ప్రజల్లో ఆసక్తితో

**సి.హెచ్.ప్రతాప్**

పాటు ఆందోళనలను కూడా పెంచుతున్నాయి. మహారాష్ట్రా సర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం రాష్ట్రంలోఉన్న 9.78 కోట్ల మంది నమోదిత ఓటర్లలో 7.71 కోట్ల మంది మాత్రమే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో చోటు దక్కించుకోగా, 2.06 కోట్ల మంది ఓటర్లు 'అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ లేదా ఇతర కారణాలు' అనే వర్గంలోకి వెళ్లారు. ఇది మొత్తం ఓటర్లలో 21.14 శాతానికి సమానం. అనంతరం అక్టోబర్ 4నాటికి కొత్త నమోదులు, అభ్యంతరాలు, సవరణల కోసం 6.24లక్షల అప్లికేషన్లు అందినట్లు అధికార గణాంకాలు వెల్లడించాయి. ఈ గణాంకాలు ఒకముఖ్యమైన ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ఎన్నికల జాబితా పరిశుభ్రత అవసరమే అయినప్పటికీ, అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదు. ముఖ్యంగా వలస కార్మికులు, పట్టణ పేదలు, వృద్ధులు, అట్టడుగు వర్గాలకు చెందిన పౌరులు డాక్యుమెంటేషన్ లేదా చిరునామా మార్పుల కారణంగా జాబితా వెలుపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వెరిఫికేషన్ ప్రక్రియలో మానవీయ దృష్టి, పారదర్శకత, సమర్థమైన అప్పీల్ వ్యవస్థ తప్పనిసరి. సాంకేతికత ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేసే సాధనంగా మారుతోంది. ఓటరునమోదు, ఎలక్టోరల్ రోల్ పరిశీలన, ఎన్నికలసమాచారం వంటిసేవలను ఒకే డిజిటల్ వేదికపై అందించే ఇసినెట్ వంటి చర్యలు పారదర్శకతను పెంచగలవు. అయితే టెక్నాలజీ మాత్రమే సరిపోదు. ఎన్నికల సంఘం స్వతంత్రత, రాజకీయపార్టీల బాధ్యతాయుత వైఖరి, మీడియా వాస్తవాధారిత కవరేజ్, పౌరుల చైతన్యం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ప్రతిసందేహాన్ని శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య ఆరోగ్యానికి సంబంధించిన అంశంగా చూడాలి. ప్రజల ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం, గణాంకాలను బహిరంగంగా పంచుకోవడం, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం ద్వారా విశ్వాసాన్ని మరింత బలపరచవచ్చు. ప్రజాస్వామ్యం పార్లమెంట్‌లోకాదు, ఓటరు జాబితాలో ప్రారంభమవుతుంది. ఆ జాబితాలోని ప్రతిపేరు ఒక పౌరుడి స్వరానికి ప్రతీక. ఆస్వరం ఎక్కడా కనుమరుగుకాకుండా చూడటం ఎన్నికల సంఘం, రాజకీయపక్షాలు, మీడియా, పౌర సమాజం అందరి ఉమ్మడి బాధ్యత.

# సర్కారీ స్థలాల పరిరక్షణ భవిష్యత్తుకు భరోసా



పాపని నాగరాజు

వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌కు అభివృద్ధి ఎంత అవసరమో, ఆ అభివృద్ధికి పునాది అయిన చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రజా అవసరాల స్థలాలను కాపాడటం కూడా అంతే ముఖ్యం. నగరం విస్తరిస్తున్న కొద్దీ భూమి విలువ పెరగడం, నివాస–వాణిజ్య అవసరాల కోసం భూమిపై ఒత్తిడి పెరగడం, పట్టణ ప్రణాళికలోని లోపాలు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపాలుకలిసి ప్రజాస్థలాలు, నీటి వనరులపై ఒత్తిడిని పెంచాయి. అందువల్ల ఆక్రమణల సమస్య నిన్నో మొన్నో పుట్టింది కాదు. ఈ నేపథ్యంలో హైడ్రా చెరువుల పునరుద్ధరణ, పూడిక తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల పరిరక్షణ, ప్రజాఆస్తుల రక్షణ వంటి చర్యలు చేపడుతోంది. కుందన్‌పల్లి చాముండిపట్నం కాలనీలో పార్కు, మార్కెట్ కోసం కేటాయించిన 7,200 చదరపు గజాల స్థలాన్ని రక్షించడం, పటాన్‌చెరులోని సాకి చెరువుకు సుమారు కిలోమీటరు మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు ప్రజా స్థలాల పరిరక్షణ అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇవి కేవలం ఆక్రమణ తొలగింపులు కాదు. నగర భవిష్యత్తులో వరదలు, నీటి కొరత, పర్యావరణ నష్టా లను తగ్గించే చర్యలుగా చూడాలి. అయితే కూల్చివేతల తర్వాత స్పందించడం కంటే, మొదటి ఇటుక పడకముందే అక్రమాన్ని అడ్డుకోవడమే సమర్థవంతమైన పరిపాలన. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్.ఎల్.టి), బఫర్ జోన్, నాలాల పరిధి, భూమి స్వభావం వంటి అంశాలు నిర్మాణానికి ముందే స్పష్టంగా నిర్ధారించాలి. ఇక్కడే పరిపాలనా వ్యవస్థలోని ఒక విరుద్ధత కనిపిస్తుంది. ఒకవైపు స్థానిక సంస్థలు నిర్మాణ అనుమతులు ఇస్తుంటే, మరోవైపు అదే నిర్మాణం తరువాత అక్రమమని తేలితే హైడ్రా చర్య తీసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే సమస్యకు శాశ్వత పరిష్కారం రాదు. మున్సిపల్, పట్టణ, గ్రామస్థాయి అధికారులు హైడ్రాతో సమన్వయం చేసుకుని భూమి స్వభావం, ఎఫ్.ఎల్.టి, బఫర్ జోన్, నాలా, ప్రజా స్థలాల అంశాలను ముందుగానే పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన సందర్భాల్లో సంబంధిత అధికారుల జవాబుదారీతనం కూడా నిర్ధారించాలి. అవినీతికి అవకాశం లేకుండా అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్), డిజిటల్ మ్యాపింగ్ వంటి సాంకేతికతలను ముందస్తు పర్యవేక్షణకు ఉపయోగించాలి. అప్పుడు హైడ్రా ఆక్రమణలను తొలగించే సంస్థగా మాత్రమే కాకుండా, ఆక్రమణలు పుట్టకుండా నిరోధించే సంస్థగా మారుతుంది. ప్రజా ఆస్తుల పరిరక్షణలో కఠినత్వం ఎంత అవసరమో, పేదల విషయంలో మానవతా దృక్పథం కూడా అంతే అవసరం. జీవనోపాధి కోసం చిన్నఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను, ప్రజాభూములను పెద్ద ఎత్తున



ఆక్రమించి వాణిజ్య ప్రయోజనాలు పొందే వ్యక్తులతో ఒకే గాటన చూడకూడదు. ముఖ్యంగా పేదలకు భూములు విక్రయించిన దళారులు, మధ్యవర్తులు, అక్రమ లేఅవుట్ల వెనుక ఉన్నవారిపై కూడా చర్య ఉండాలి. ఇప్పటికే నివసిస్తున్న కుటుంబాల విషయంలో నిర్ణీత తేదీని ప్రామాణికంగా తీసుకుని, నివాస కాలం, కుటుంబానికి ప్రత్యామ్నాయ నివాసం ఉందా, నిర్మాణం నివాస అవసరానికేనా, భూమిస్వభావం, కుటుంబ ఆర్థిక పరిస్థితి వంటి ప్రమాణాలతో అర్హతను నిర్ణయించాలి. ఈ పరిశీలన హైడ్రా, రెవెన్యూ శాఖ, సంబంధిత స్థానిక సంస్థల ప్రతినిధులతో కూడిన పారదర్శక వ్యవస్థ ద్వారా జరగాలి. అర్హులైన కుటుంబాలకు అవసరమైన చోట ప్రత్యామ్నాయ నివాసం లేదా పునరావాసం కల్పించాలి. ముఖ్యంగా ఎఫ్.ఎల్.టి, నాలా, వరద మార్గంవంటి ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే కుటుంబాలను భద్రతకారణంగా తరలించాల్సి వస్తే, తరలింపు ముందు ప్రత్యామ్నాయ నివాసం, ప్రాథమిక సదుపాయాలు, సాధ్యమైనంత వరకు జీవనోపాధికి అనుసంధానం వంటి అంశాలను ప్రభుత్వం స్పష్టంగా నిర్ధారించాలి. యుఎన్ హ్యాబిటేట్ 2026 వరల్డ్ సిటీస్ రిపోర్టు కూడా అనధికార నివాసాల విషయంలో కేవలం తొలగింపుకంటే స్థానిక పరిస్థితులకు అనుగుణమైన అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, జీవనోపాధి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తోంది. పేదల ఇళ్లను తొలగించి, వారిని అక్కడికి తీసుకువచ్చిన దళారీ వ్యవస్థ అలాగే మిగిలిపోతే సమస్య పరిష్కారం కాదు. అదే సమయంలో ఈ మానవతా విధానం కొత్త ఆక్రమణలకు ప్రోత్సాహంగా మారకూడదు. వరదల విషయంలో కూడా పైకి కనిపించేది నీటిముంపు. కానీ లోపల ఉన్నసమస్య సహజనీటి ప్రవాహ మార్గాల మార్పు, నాలాల సామర్థ్యం తగ్గడం, చెరువులఅనుసంధానం దెబ్బతినడం, ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలు పెరగడం. అందువల్ల ఒక చెరువును మాత్రమే రక్షించడం కాకుండా, ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీరు వెళ్లే సహజ మార్గాలను కూడా ప్రజాఆస్తులుగా గుర్తించి కాపాడాలి. వర్షంపడిన తర్వాత నీటిని తోడటం అవసరమే, కానీ నీరు ఎక్కడికి వెళ్లాలి, దానిమార్గాన్ని ఎక్కడ అడ్డుకున్నారు, ఏ ప్రాంతం ప్రమాదంలో ఉంది అనే విషయాలను ముందు గానే గుర్తించడం మరింత ముఖ్యం. హైడ్రాకు అసలు పరీక్ష ఇక్కడే ఉంది. కూల్చివేతల సంఖ్య కంటే కట్టకముందే ఎన్ని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నాం, ముందుగానేఎన్ని ప్రజా ఆస్తులను రక్షించాం అనేదే దాని పనితీరుకు ముఖ్య మైన కొలమానంగా మారాలి. ఎందుకంటే ఒక అక్రమ నిర్మాణం కూల్చివేసిన తరువాత కనిపించేది భవనం మాత్రమే. కానీ అది అక్కడికి ఎలా వచ్చింది, ఎవరు భూమిని విక్రయించా రు, ఎవరు అనుమతి ఇచ్చారు, పర్యవేక్షణ ఎక్కడ విఫల మైంది అనే అసలు ప్రశ్నలు మిగిలిపోతాయి. మూల కారణాలను సరిచేయకుండా కేవలం కూల్చివేతలు కొనసాగితే సమస్య మరోప్రాంతంలో మళ్లీ పుట్టే అవకాశం ఉంటుంది. అందుకే హైడ్రా, మున్సిపల్ సంస్థలు, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, నీటిపారుదల శాఖలు పరస్పరం బాధ్యతను నెట్టు కోకుండా సమన్వయంతో పనిచేయాలి. ప్రజలకు అందుబాటులో ఉండే ఎఫ్.ఎల్.టి, బఫర్ జోన్, నాలాలు, ప్రభుత్వ భూముల మ్యాపులు, పారదర్శక అనుమతులవ్యవస్థ, ఫిర్యాదులపై నిర్ణీత కాలపరిమితిలో చర్య, అధికారుల జవాబుదారీతనం అవసరం. హైడ్రా చట్టబద్ధత, పారదర్శకత, సమానత్వం, మానవతతో పనిచేస్తూ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలి. నగరాన్ని కాపాడటం అంటే కేవలం భూమిని కాపాడటంకాదు, ప్రజలకు సురక్షితమైన నివాసం, జీవనోపాధి, పర్యావరణం, ప్రజాస్థలాలను సమన్వయంతో కాపాడటం. చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు, పాఠశాల స్థలాలు, ప్రభుత్వ భూములు నేటి తరానికే కాదు,

# ప్రజావాక్కు



## సవాలుగా మారుతున్న ఉగ్రవాదం

**అంతర్జాతీయ** సంబంధాల్లో ఉగ్రవాదం ఇప్పటికీ ప్రపంచ శాంతి, భద్రతలకు అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకుచోటు ఉండకూడదని భారత్ చాలా కాలంగా స్పష్టంగాచెబుతోంది. ఇటీవల అమెరికాకు భారత్ చేసినహెచ్చరికలు, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వివిధ అంతర్జాతీయ వేదికలపై చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే ఆందోళనను ప్రతిబింబిస్తున్నాయి. భారత్ ఎప్పటినుంచో ఒక విషయాన్ని నొక్కిచెబుతోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వ్యవస్థలు, వాటికి మద్దతు ఇచ్చే నెట్‌వర్క్‌లు ఏ రూపంలోఉన్నా వాటిని నిర్దాక్షిణ్యంగాఎదుర్కోవాలి. రాజకీయ లేదా వ్యూహాత్మక ప్రయోజనాల కోసం కొన్ని ఉగ్ర వాద సంస్థలపై మౌనం పాటించడం చివరకు ప్రపంచ శాంతికే ప్రమాదమని భారత్ అభిప్రాయం.

– సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

## సభ్యత్వాలను వదులుకోవాలి

**పదవుల్లో** ఉన్నా లేకపోయినా ఎమ్మెల్యేగా గెలిచిన వారందరు అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన మాట్లాడాలి. సభలో వారి సమస్యలు లేవనెత్తాలి. అయితే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాజీలు అయ్యాక అసెంబ్లీ మొహం చూడకుండా, ప్రజాసమూహాల్లోకి రాకుండా నివాస గృహాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ నియోజకవర్గ ప్రజలకు కూడా వారు కనిపించడం లేదు. ఇలాంటి వారిని ఆ పార్టీ నాయకులు సమర్థిస్తున్నారు. వెనకేసుకు వస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ప్రతిపక్ష నాయకులుగా తమ బాధ్యతలను నిర్వర్తించాలి. లేకుంటే సభ్యత్వాలను వదులుకోవాలి.

– ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## మంచి సినిమాలు ప్రదర్శించాలి

**గ్రామాలలో** మారుతున్న కాలానుగుణంగా నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్న ప్రజలకు సమాజం పట్ల, కుటుంబ పట్ల బాధ్యత, సంబంధాల బాంధవ్యాల పట్ల అవగాహన కల్పించే సినిమాలను ఉచితంగా గ్రామలలో ప్రదర్శించాలి. గ్రామ పాలకవర్గం ప్రత్యేక దృష్టి పొందుపరిచి ప్రజలు వీక్షించేలా అవకాశం కల్పించాలి. అందరూ ఒకే దగ్గరికి చేర్చడంతో పాటు సినిమాలోని భావాలను పంచుకునే అవకాశం కలదు. కొంచెమైనా మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంది.

– మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## మరికొన్ని అనాధాశ్రమాలు నెలకొల్పాలి

**పిల్లల** ఆదరణ కరవైన తల్లిదండ్రులువృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారని అనేక వ్యాసాలు, ఉపన్యాసాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఇందులో కొంత నిజమయినా పరిపూర్ణతతో కూడిన వాస్తవం లేదు. ఎందుకంటే ఇదివరకు అన్నీ ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందరు తలోపని పంచుకుని చేసుకునే వారు. ఇప్పుడు ఆ వ్యవస్థ లేదు. భార్యాభర్తలు ఉద్యోగాలు, పిల్లలు చదువుల కోసం ఇలా అందరూ ఇళ్ళకు తాళం వేసి బయటకు వెళ్ళిపోతారు. వృద్ధులైన తల్లిదండ్రులు వారి పని వారు చేసుకోవడమే కష్టంగా ఉంటోంది. కన్న వారింటికి వెళ్ళినా అక్కడా వంటపని, ఇంటి పని తప్పడం లేదు. ఇది సామాన్య మధ్యతరగతి కుటుంబాల గాధ. ఏదో కొంత డబ్బు కట్టో లేక ఉచిత ఆశ్రమాలలోనో అయితే వేళకు ఇంత తిని ప్రాణం నిలుపుకోవచ్చు. ఇంట్లో చేసుకుతినే శ్రమ తప్పుతుంది. ఇందులోవృద్ధులైన ఆడవారి బాధలు వర్ణనాతీతం. కొడుకులు కోడళ్ళు మంచివాళ్ళు కావచ్చు. కానీ అన్నిసదుపాయాలు సమకూర్చడం సమస్యగా మారుతుంది.

– డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## రాజ్యాంగంలో రీకాల్ పొందుపరచాలి

**సిజెపికాక్రోచ్** జనతా పార్టీనుకాంగ్రెస్ జనతా పార్టీ అనవచ్చు. కాంగ్రెస్ అంటే కలయిక. జెన్‌జి యువతరం అసహనం మొదట్లో పరీక్షల విధానం మీద, ఇప్పుడు ఎన్నికల సంఘం మీద. ఇది ప్రభుత్వం మీద కాదు ప్రభుత్వానికి వ్యతిరేకం కూడా కాదు. న్యాయ వ్యవస్థకు వ్యతిరేకం అంతకన్నా కాదు. వారి నిరసన తెలుపడానికి రాజ్యాంగపరంగా వారికి హక్కు ఉంది. చదువుకున్న యువతరం గళం ప్రజాప్రతినిధులు విని తీరాలి. ఎప్పుడైనా ప్రజాస్వామ్య యుతంగా ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు మెజారిటీ ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే రీకాల్ చేసేవిధానం ఇప్పటికైనా రాజ్యాంగంలో పొందుపరచాల్సిన అవసరం ఉంది.

– వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పాలమూరు వలసలు

**ఎల్‌నినో** ప్రభావంతో కరవుతాండవంచేస్తున్న ఈ సమయంలో మళ్లీ పాలమూరు వలసలు ఇబ్బందులు పెడుతున్నాయి. కృష్ణమ్మా పరవళ్లు విన్న ఆ జిల్లా ఇప్పుడు పాలమూరు వలస బాటపడుతుంది. ఎక్కువస్థాయిలో వర్షపాతం నమోదు కావాల్సినజిల్లాలో పంటలు ఎండిపోయిన పరిస్థితులలోట్యాంకర్స్ పెట్టి నీళ్లు కొట్టించుకుంటున్న పరిస్థితి ఉంది. కాబట్టి నీటిని పొదుపుగా వాడుకుంటూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి.

–భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

12-10Pg6exHMNWJQE.qxd:12-10Pg6exHMNWJQE.qxd 1/1/02 6:11 AM Page 1



## రంగనాథ స్వామి గుడి వద్ద అగ్నిప్రమాదం

**నెల్లూరు క్రైం, అక్టోబరు 11, ప్రభాతవార్త:** నగరంలోని ప్రసిద్ధ రంగనాథ స్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న వేదాంత దేశికర్ దేవాలయం వద్ద ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాణాసంచా కారణంగానే ఈ ప్రమాదం సంభ వించినట్లు స్థానికులు, అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. దేవాలయం ముందు ప్రత్యేకంగా వేసిన పందిళ్లు, అక్కడే నిల్వ ఉంచిన చెక్క సామాగ్రి ఒక్కసారిగా మంట ల్లో చిక్కుకున్నాయి. అంతేకాకుండా, దేవాలయం ఎదుట నిలబెట్టిన పలు వాహనాలు కూడా మం టలకు పూర్తిగా ఆహుతయ్యాయి. మంటలు వేగంగా ఎగిసిపడటంతో దట్టమైన పొగలు అలు ముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సంతపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను పూ ర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సమయానికి స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని, ప్రాణనష్టం ఏమీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇన్చార్జి ఏడిఎఫ్ఓ దేవి ద్సన్, ఫైర్ సిబ్బంది కిరణ్ కుమార్, కమలాకర్, తాజ్మల్ హుస్సేన్, నరహరి తదితరులు సహా యక చర్యల్లో పాల్గొన్నారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమరావతి ఓఆర్ఆర్‌లో కీలక మార్పులు

- 19 చోట్ల ఇంటర్‌ఛేంజ్‌లో రెండు తగ్గింపు
- కంచికచర్ల వద్ద డబుల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్
- చలివేంద్రపాలెం సమీపంలోను డబుల్ ట్రంపెట్



**అమరావతి, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలోని కీలక జాతీయ రహదారులను అనుసంధానం చేసే ఈ ఓఆర్ఆర్‌లో మొత్తం 189.93 కిలోమీటర్ల మేర 6 వరుసలతో యాక్సెస్ కంట్రోల్డ్ రహదారిగా దీనిని నిర్మిస్తున్నారు. ఈ ఓఆర్ఆర్‌లోకి వాహనాలు ప్రవేశించాలన్నా, బయటకు రావాలన్నా కేవలం ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద మాత్రమే అవకాశం ఉంటుంది. జాతీయ రహదారులను క్రాస్ చేసే 8 చోట్ల డబుల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్‌లు, రాష్ట్ర, జిల్లా రహదారులను క్రాస్ చేసే ప్రాంతాల్లో ఒక సింగిల్, 8 రోటరీ ఇంటర్‌ఛేంజ్‌లను మొత్తంగా 17 ఏర్పాటు చేయనున్నారు. కంచికచర్ల వద్ద విజయవాడ - హైదరాబాద్ హైవేపై డబుల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ నిర్మిస్తారు. కంచికచర్ల - మధిర రాష్ట్ర రహదారి క్రాస్ అయ్యే పొన్నవరానికి దగ్గరలో 3.90 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. విజయవాడ- ఖమ్మం నాగ్‌పూర్ హైవే క్రాస్ అయ్యే దుగ్గిరాలపాడు సమీపంలో 18.30 కి.మీ. వద్ద డబుల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. ఇబ్రహీంపట్నం నుంచి ఉత్తరాఖండ్ వెళ్లే హైవే మైలవరానికి దగ్గరలో క్రాస్ అయ్యే 31.29 కి.మీ. వద్ద డబుల్ ట్రంపెట్ నిర్మిస్తారు. అడవినెక్కలం- వెల్వడం రోడ్ క్రాస్ అయ్యే 42.50 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. ఆగిరిపల్లి సమీపంలోని విజయవాడ- నూజివీడు రోడ్ క్రాస్ అయ్యే 47.80 కి.మీ. వద్ద డబుల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. చెన్నై- కోల్‌కతా హైవేలో పొట్టిపాడు వద్ద 66.10 కి.మీ. పాయింట్ వద్ద డబుల్ ట్రంపెట్ నిర్మిస్తారు. గన్నవరం- పుట్టగుంట రోడ్ క్రాస్ అయ్యే 71.54 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. విజయవాడ- గుడివాడ రోడ్డును మానికొండ వద్ద క్రాస్ చేసే 80.31 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. విజయవాడ- మచిలీపట్నం హైవేపై చలివేంద్రపాలెం సమీపంలో 85.90 కి.మీ. వద్ద డబుల్ ట్రంపెట్ నిర్మిస్తారు. గుంటూరు- హనుమాన్‌పాలెం రోడ్ క్రాస్ అయ్యే నందివెలుగు వద్ద 105.70 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. నారాకోడూరు నుంచి బుడంపాడు అనుసంధాన రహదారి క్రాస్ చేసే నారాకోడూరు వద్ద 123.20 కి.మీ. వద్ద డబుల్ ట్రంపెట్ నిర్మిస్తారు. అనంతవరప్పాడు- ముట్లూరు రోడ్డులో అనంతవరప్పాడు సమీపంలో 128.70 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. గుంటూరు- ప్రత్తిపాడు-పర్చూరు రోడ్డులో పుల్లడిగుంట వద్ద 134.90 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. గుంటూరు శివారులోని పొత్తూరు- లింగాయపాలెం మధ్య చెన్నై- కోల్‌కతా హైవే క్రాస్ చేసే 139.90 కి.మీ. వద్ద డబుల్ ట్రంపెట్ నిర్మిస్తారు. మేడికొండూరు సమీపంలో వినుకొండ- గుంటూరు హైవేని క్రాస్ చేసే 149.02 కి.మీ. వద్ద సింగిల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది. సత్తెనపల్లి- అమరావతి రాష్ట్ర రహదారిని క్రాస్ చేసే బలుసుపాడు సమీపంలో 170.70 కి.మీ. వద్ద రోటరీ ఇంటర్‌ఛేంజ్ వస్తుంది.

గతంలో ఓఆర్ఆర్‌పై 19 చోట్ల ఇంటర్‌ఛేంజ్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.38,450 కోట్లుగా ఉండటంతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) వ్యయం తగ్గించాలని ఆదేశించింది. దీంతో బయటివైపు సర్వీస్ రోడ్ల ప్రతిపాదనను అధికారులు తొలగించి, లోపలి వైపు మాత్రమే ఉంచారు. అలాగే తెనాలి సమీపం నుంచి చెన్నై కోల్‌కతా జాతీయ రహదారిలోని కాజ వరకు 17.5 కి.మీ మేర ప్రతిపాదించిన ఆరు వరుసల అనుసంధాన రహదారిని కూడా పక్కనపెట్టారు. ఆ అనుసంధాన రహదారి ప్రారంభ, ముగింపు ప్రాంతాల్లో నిర్మించాల్సిన 2 ఇంటర్‌ఛేంజ్‌లను తొలగించారు. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం రూ.30,491 కోట్లకు తగ్గడంతో పాటు, ఇంటర్‌ఛేంజ్‌ల సంఖ్య 17కు కుదించారు.

## కరెంట్ బిల్లుల బకాయిల చెల్లింపునకు 'ఓటీఎస్'

- అవకాశమిచ్చిన ఎపిఇఆర్‌సి

**విజయవాడ, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** కరెంటు బిల్లుల దీర్ఘకాల బకాయిదారులకు ఎపిఇఆర్‌సి ఏకకాలంలో బాకీ మొత్తాల చెల్లింపు అవకాశం కల్పించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సర్వీసుల వినియోగదారులు తమ పెండింగ్ బిల్లులను వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద చెల్లించి, బకాయిల నుంచి పూర్తిగా విముక్తి పొందేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు తక్షణం అమలులోకి వచ్చే విధంగా ఇటీవల జారీ చేసింది. డిస్కంలో భారీగా పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసుకునేందుకు వీలుగా ఓటీఎస్ అవకాశాన్ని మరోసారి కల్పించాలని కోరుతూ డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్‌పై కమిషన్ సానుకూలంగా స్పందించింది, ఇందుకు అనుమతినిచ్చింది. ఓటీఎస్ విధానం 2022 డిసెంబరు 31 వరకు అమలులో ఉండేదని, మారుతున్న పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వినియోగదారులకు ఈ నిబంధనను మరోసారి వర్తింపజేయాలని డిస్కంలు తమ పిటిషన్‌లో కోరాయి. ముఖ్యంగా ప్రైవేటు సంస్థల విద్యుత్ బకాయిలను అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్‌గా పరిగణించడం వల్ల చట్టపరంగా వసూళ్లు చేయడం చాలా కష్టతరంగా మారిందని డిస్కంలు పేర్కొన్నాయి. ఇలాంటి వివాదాలు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) పరిధిలోకి వెళ్లినప్పుడు, అక్కడ సుదీర్ఘ కాలం తర్వాత పరిష్కారమైనా, అసలు బకాయిలతో పోలిస్తే వసూలయ్యే మొత్తాలు చాలా తక్కువగా ఉంటున్నాయని డిస్కంలు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాయి. ఈ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించిన ఎపిఇఆర్‌సి, సంస్థల ఆర్థిక ప్రయోజనాలతో పాటు వినియోగదారుల హితాన్ని దృష్టిలో ఉంచుకుని ఓటీఎస్ పథకం అమలుకు ఆమోదముద్ర వేసింది. ఎపిఇఆర్‌సి తాజాగా ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి 2027 జూన్ వరకు ఈ ప్రతిష్టాత్మక ఓటీఎస్ పథకం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన నాటికి కనీసం సంవత్సర కాలంగా బిల్లుల జారీ నిలిచిపోయిన ఎల్‌టి (లోటెన్షన్), హెచ్‌టి (హైటెన్షన్) కేటగిరీల వినియోగదారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఓటీఎస్ కింద బకాయిల వ్యవహారం పూర్తిగా పరిష్కారమైన తర్వాత డిస్కంలు ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరిస్తాయి. అయితే, ఒకవేళ క్షేత్రస్థాయిలో విద్యుత్ సర్వీస్ వైరును అప్పటికే పూర్తిగా తొలగించి ఉంటే మాత్రం, కనెక్షన్ పునరుద్ధరణకు అయ్యే ఛార్జీలను వినియోగదారుల నుంచి డిస్కంలు వసూలు చేస్తాయి. ఎన్‌సిఎల్‌టి వద్ద ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసుల బకాయిలను మాత్రం ఈ ఓటీఎస్ కింద చెల్లించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోరని కమిషన్ స్పష్టం చేసింది.

## పెద్దపులి సంచారంపై ఆందోళన వద్దు: మంత్రి దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో పెద్దపులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందవద్దని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ధైర్యం చెప్పారు. స్పెయిన్ పర్యటనలో నున్న మంత్రి అక్కడి నుండి వీడియో సందేశం విడుదల చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పుణెకు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని నిడదవోలుకు వస్తున్నారని, స్థానిక అటవీ అధికారుల సహకారంతో పులిని బంధించి సురక్షి తంగా అడవిలోకి విడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రత్యేక రక్షణ బృందాలు పులిని పట్టుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయని ఆయన వెల్లడించారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండే బాధ్యత కూటమి ప్రభుత్వానిది అని మంత్రి భరోసా ఇచ్చారు.

# మండవ వెంకట్రామయ్య జీవితం భావితరాలకు మార్గదర్శకం

- 'భువి నుంచి భువనం వరకు' పుస్తకావిష్కరణ సభలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**నూజివీడు, అక్టోబరు 11 ప్రభాతవార్త:** నిరాడంబరత, నిష్కళంక జీవన విధానానికి నిలువెత్తు నిదర్శనం మండవ వెంకట్రామయ్య అని, ఆయన జీవితం భావితరాలకు గొప్ప మార్గదర్శకమని భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. నూజివీడు మండలం తుక్కులూరులో ఆదివారం నిర్వహించిన మండవ వెంకట్రామయ్య స్మారక కార్యక్రమంలో ఆయన జీవిత విశేషాలతో రూపొందించిన 'భువి నుంచి భువనం వరకు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎస్సీ. పట్టా పొందిన మండవ వెంకట్రామయ్య, పట్టణాల్లో స్థిరపడకుండా స్వగ్రామానికి తిరిగివచ్చి విత్తన పరిశ్రమను స్థాపించడం గొప్ప విషయమన్నారు. వ్యాపారాన్ని కేవలం ధనార్జనగా కాకుండా ప్రజాసేవగా భావించారని, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటు ధరల్లో అందించడమే లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. ఎదురైన ఒడిదుడుకులను జీవిత పాఠాలుగా స్వీకరిస్తూ ఎంతోమంది యువతకు ఉపాధి కల్పించారని, వారు తమ కాళ్లపై నిలబడేందుకు అండగా నిలిచారని తెలిపారు. క్రమశిక్షణ, సమయపాలన, వినయం, నిరాడంబరత ఆయన ప్రత్యేకతలని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల పట్ల ప్రేమానురాగాలు చూపడంతో పాటు సమాజానికి ఉపయోగపడే జీవితాన్ని గడిపారని ప్రశంసించారు. నేటి యువత పెద్దలు అందించే విలువలు, సంస్కృతి, కుటుంబ సంప్రదాయాలను గౌరవించాలని వెంకయ్య నాయుడు సూచించారు. తల్లిదండ్రులు, తాతయ్యలు, బామ్మలతో వారు జీవించి ఉన్నప్పుడే సమయం గడుపుతూ వారి అనుభవాలను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. భువి నుంచి భువనం వరకు పుస్తక రచయిత డాక్టర్ పాలకోడేటి సత్యనారాయణరావును, పుస్తక రూపకల్పనకు చొరవ తీసుకున్న మండవ ప్రభాకరరావు, ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. మండవ వెంకట్రామయ్య ఆశయాలు భావి పారిశ్రామికవేత్తలకు, సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఆకాంక్షించారు. కార్యక్రమానికి టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు డైరెక్టర్ మేడసాని మోహన్ అధ్యక్షత వహించారు. గౌరీశంకర్ ఆలపించిన అన్నమయ్య, త్యాగయ్య కృతులు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కరణం బలరామకృష్ణమూర్తి, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, కేంద్ర విజిలెన్స్ కమిషన్ మాజీ చైర్మన్ కె.వి. చౌదరి, బొల్లినేని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

**సింగరాయకొండ, అక్టోబరు 11 ప్రభాతవార్త:** సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. శనివారం ఏడుగురు యువకులు సముద్రంలో ప్రమాదానికి గురికాగా ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతవగా, ముగ్గురు చికిత్స పొందుతున్నారు. గల్లంతైన దేవెండ్ల విష్ణు (17), దేవెండ్ల నారాయణ (30) కోసం మత్స్యకారులు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం సముద్రంలో తేలియాడుతూ ఒడ్డుకు సమీపంలో కనిపించిన విష్ణు మృతదేహాన్ని మత్స్యకారులు తాడుతో ఒడ్డుకు చేర్చారు. సాయంత్రం చెల్లమ్మగారిపట్టపుపాలెం తీరానికి నారాయణ మృతదేహం కొట్టుకొచ్చింది. దీంతో మత్స్యకారులు మెరైన్ సీఐ శివన్నారాయణకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# తిరుమల సమాచారం

## నిబంధనల మేరకే సేవచేయండి

- అతిక్రమిస్తే అతిథిగృహాన్ని స్వాధీనం చేసుకుంటాం
- కర్నాటక సర్కార్‌కు టిటిడి హెచ్చరిక

**తిరుమల,అక్టోబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర స్థలాన్ని వ్యాపార కేంద్రంగా మార్చాలని చూస్తున్నారని ఆరోపణ నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని టిటిడి కర్నాటక సర్కార్‌కు హెచ్చరిక జారీచేసింది. తిరుమలలోని కర్ణాటక ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వ్యవహారంపై టిటిడి తీవ్రంగా స్పందించింది. వివాదాస్పద నిర్ణయాన్ని కర్ణాటక సర్కార్ వెనక్కి తీసుకోకపోతే, ఆ గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. తిరుమలలో కర్ణాటక సత్రాల వివాదం తీవ్రమవుతోంది. వీటి నిర్వహణ ఆ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ కార్పొరేషన్(కేఎస్‌టిడిసి) తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఈ యవ్వారంపై టిటిడి బోర్డు సభ్యులు, ముఖ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలో ఉండే అన్నింటి పైనా టిటిడికే బాధ్యతలు ఉంటాయని తేల్చి చెబుతున్నారు. తిరుమలలో కర్ణాటక ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం వివాదంగా మారుతోంది. తిరుమల కొండ పైన కర్ణాటక సత్రాల నిర్వహణ బాధ్యతలను ఆ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ కార్పొరేషన్(కేఎస్‌టీడీసీ) తీసుకోవడం ఈ వివాదానికి కారణంగా మారింది. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ పరిధిలో ఉన్న కర్ణాటక ప్రవాస సౌధ భవనాలను ఇకపై కేఎస్‌టిడిసి నిర్వహిస్తుందని ఇటీవల ఆ శాఖ ఎండీ శివప్రసాద్ తిరుమలలో ప్రకటించారు. తిరుమలలోని వివిధ మఠాలతో పాటు కర్ణాటక సత్రాల నుంచి కూడా రోజూ శ్రీవారికి సమర్పిస్తున్న నిత్య హారతుల్లో తమ రాష్ట్ర అధికారులను, ప్రజాప్రతినిధులను పంపుతామని కర్ణాటక సీఎం డికె శివకుమార్ చేసిన ప్రకటనపై గతంలో తీవ్రస్థాయి దుమారం రేగింది. ఇప్పుడు ఆలయం వెనుకభాగంలో సుమారు ఏడున్నర ఎకరాల స్థలంలో ఉన్న కర్ణాటక సత్రాలను దేవదాయ శాఖ నుంచి కర్ణాటక టూరిజం శాఖ తీసుకోవడం వివాదంగా మారింది. మైసూర్ మహారాజు గౌరవార్థం టిటిడి ఇచ్చిన ఏడున్నర ఎకరాల స్థలంలో కర్ణాటక ప్రభుత్వం యాత్రికుల కోసం గదులు నిర్మించిందని, అయితే ఆ భవనాలను టూరిజం శాఖకు అప్పగించడం మంచిది కాదని పేర్కొన్నారు. కర్ణాటక సత్రాల్లోని షాపులను, హోటళ్లను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని... ఇలానే ముందుకెళ్లాలని ప్రయత్నిస్తే మొత్తం ఆస్తిని టిటిడి స్వాధీనం చేసుకుంటుంది అని చెప్పుకొచ్చారు. అలాంటి తిరుమలలో కర్ణాటక సత్రాలను పర్యాటక శాఖకు ఇవ్వాలని నిర్ణయించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేసారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వారికి నోటీసులు పంపుతామని, స్పందించకపోతే గెస్ట్‌హౌస్‌ను టిటిడి ఆధీనంలోకి తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

## దత్తమందిరంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అరంభం



**తిరుపతి,అక్టోబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** దేవీన వరాత్రి ఉత్సవాల్లో బాగంగా ప్రకాశం జిల్లా కందుకూరు లింగసముద్రం మండలం మొగలచెర్లలోని దత్తాత్రేయ మందిరంలో వేడుకగా ఆదివారం దేవీనవ రాత్రులు ప్రారంభమయ్యాయి. ఆది వారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ శుభ సందర్భంగా అమ్మవారి అవతార ఆవిష్కరణ, ప్రథమ పూజ, భవానీ దీక్షా మాలాధారణ కార్యక్రమం జరిగాయి.

## తిరుపతిలో 75 గంటల నిరంతరాయ డప్పు నాదం




**తిరుపతి,అక్టోబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం 25 ఏళ్ల ప్రజాసేవా సు పరిపాలన ప్రస్థానాన్ని పురస్కరించుకుని బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని తారక రామా స్టేడియంలో డప్పునాదం చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి విచ్చేసిన డప్పు కళాకారులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాతంగి పీఠాధిపతి నందగిరి స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండువేల మంది డప్పు కళాకారులకు ఉచితంగా డప్పులు పంపిణీ చేపట్టడంతో బాటు ఐదు లక్షల పోస్టుకార్డుల ద్వారా ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో మూడు రోజుల బాటు 24 గంటల నిరంతరాయంగా 2వేల మంది డప్పు కళాకారులతో డప్పు కళాకారుల ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత

- నేటి నుండి 20 వరకు వాహనసేవలు
- 2,800 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైనబందోబస్తు



**తిరుమల,అక్టోబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో నేటి నుండి 20వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. తిరుమల పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పోలీసు అధికారులతో ఆదివారం మాట్లాడిన ఆయన బందోబస్తు ప్రణాళిక, సిబ్బంది విధుల కేటాయింపు, రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. బ్రహ్మోత్సవాల బందోబస్తు కోసం మొత్తం2,800 మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన అక్టోబరు 16న గరుడసేవ, 17న పుష్పకవిమానం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. నాలుగు మాడ వీధులు, గ్యాలరీలు, ప్రధాన రాకపోకల మార్గాలు, ఘాట్ రోడ్లు, పార్కింగ్ ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, రద్దీ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా నియంత్రించాలని సూచించారు. అవసరమైన చోట్ల బారికేడ్లు, దారి సూచిక బోర్డులు, ట్రాఫిక్ మళ్లింపులు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని తెలిపారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, పార్కింగ్ నిర్వహణ, గరుడసేవ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర వాహనాలకు మార్గాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. తిరుపతిలో అవసరమైన హోల్డింగ్ పాయింట్లను వినియోగించుకోవడంతో పాటు టీటీడీ, ఆర్టీసీ, రవాణా శాఖ, ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణ, క్షేత్రస్థాయి పరిస్థితుల నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో చోటుచేసుకునే పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పరిశీలించి, పరిస్థితులను సమీక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టేందుకు రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించి, సమస్యలు తలెత్తినప్పుడు వేగంగా స్పందించేందుకు ప్రధాన కంట్రోల్ రూమ్‌తో పాటు సబ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారం, ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు సామాజిక మాధ్యమం పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక జాయింట్ యాక్షన్ టీమ్‌లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సిసిటివి కెమెరాలు, బాడీ వార్న్ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా రద్దీ, ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్, సబ్ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు. క్షేత్రస్థాయి పరిస్థితుల నిరంతర పర్యవేక్షణకు రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థ.

## భోళా శంకరా! ఆదుకోవయ్యా!

### శ్రీకాళహస్తీశ్వరాలయంలో వారాంతపు రద్దీ



**శ్రీకాళహస్తి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం వారాంతపు రద్దీ చోటుచేసుకుంది. ఉదయం నుంచి ఎటు చూసినా భక్తుల సందడి నెలకొంది. ముక్కంటీశుని దర్శించుకొని శాంతి సౌఖ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్న భక్తులు, సమీపంలోని అభయ వెంకటేశ్వరుని సంపద కోసం వేడుకుంటున్నారు. మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన వస్తుంది. రద్దీ రోజుల్లో కనీసం 30వేలకు మించి భక్తులు హాజరయ్యారు. ఎటు చూసినా భక్త జనమే అన్నట్లు మారింది. ఓ వైపు కాలినడకన వచ్చే భక్తులు మరో వైపు వాహనాల రద్దీతో కిట కిటలాడింది. ఆదివారం అధికారికంగా దేవస్థానం జారి చేసిన సమాచారం మేరకు 20 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా సుమారు 5వేలు దాటాయి. శనివారం మహాళయ అమావాస్య సందర్భంగా భక్తులు కిటకిట లాడగా ఆదివారం పాడ్యమి కావటంతో రద్దీ తక్కువగా ఉందని అలయ నిర్వాహకులు తెలిపారు. దాంతో వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శించుకున్నారు.

## ఆలయాల్లో నవరాత్రుల శోభ

- దివ్యాలంకారాల్లో అమ్మవార్ల దర్శనం



**శ్రీకాళహస్తి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టంలో ఉన్న అమ్మవారి ఆలయాల్లో సందడి చోటుచేసుకుంది. నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కావటంతో ఆలయాలు మహిళా భక్తులతో కిటకిట లాడాయి. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో దసరా శోభాయమానంగా ఏర్పాటు చేశారు. ఉదయం బజారువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య ప్రముఖులు పట్టణంలో ఊరేగింపు జరిపారు. అమ్మవారికి సారెను అందించారు. కనకాచలంపై వెలసి దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వేకువ జామునుంచే ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కనకాచలాన్ని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు విద్యుత్ దీపాల అలంకారం చేపట్టారు. ఉదయం ఆలయం నుంచి కలశాన్ని ఆలయాధికారులు తీసుకొని కొండపైకి వెళ్లారు. ఉభయదారులు వెంటరాగా అమ్మవారికి అభిషేకాలు జరిపారు. కలశాలతో పాటు ఉభయదారులు కాసరం బాలాజి పాల్గొన్నారు.

**ఆకట్టుకుంటున్న ఆలంకారాలు:**

దసరా ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు భాగంగా భాస్కరపేటలోని రాజరాజేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బజారువీధిలోని శ్రీ కన్యకారపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో చైర్మన్ జూలుగంటి మురళీకృష్ణ, ఉప్పువీధి ఆలయంలో అధ్యక్షులు సారథ్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఉభయదారులు పొట్టి భాస్కర్, పొట్టి హరీష్‌లు వెంట రాగా సంఘ ప్రముకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలందరికీ సిఎం చంద్రబాబు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. దుష్టశక్తులపై దైవశక్తి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా అని అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ దివ్యాశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజ లందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యా లు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు.

## తెలుగు ప్రజలకు మంత్రి లోకేశ్ దసరా నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు

**విజయవాడ, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు ప్రజలందరికి దసరా ఉత్సవాల ప్రారంభ సందర్భంగా టిడిపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. భక్తులను ఎల్లవేళలా కాపాడే బెజవాడ కనకదుర్గమ్మ తొమ్మిది రోజులు, తొమ్మిది అలంకారాలలో దర్శనం ఇచ్చే శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. రాష్ట్రవ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్న దుర్గాదేవి మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నా అని లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## శరన్నవరాత్రి వేడుకలు.. రాష్ట్ర ప్రజలకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా మాజీ సీఎం జగన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారు భక్తులకు వివిధ అలంకారాలలో దర్శన మివ్వనున్నారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు, భక్తులకు శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

12-10Pg7exHMNWJQE.qxd OK:12-10Pg7exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1



### విజయవాడలో రేపటి నుంచి

# జాతీయ సరస్ ఆజీవిక మేళా

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

**విజయవాడ, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ కళాకారులు, పారిశ్రామికవేత్తల అద్భుతమైన ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గొప్ప మార్కెటింగ్ వేదికగా 'జాతీయ సరస్ ఆజీవిక మేళా-2026 నిలుస్తోందని మంత్రి కొండవీటి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో అక్టోబర్ 13 నుంచి 31 వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటవుతోందని మంత్రి కొనియాడారు. ఈ మేళాలో రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 576 స్టాళ్లు ఏర్పాటు చేశామని.. రాష్ట్రం నుంచి అత్యధికంగా 208 స్టాళ్లు ఉండగా, రాజస్థాన్ (24), మధ్యప్రదేశ్ (23), ఉత్తరప్రదేశ్ (22), మహారాష్ట్ర (21), పశ్చిమ బెంగాల్ (19), కేరళ (17), పంజాబ్ (17) రకరకాల స్టాల్స్ ఈ మేళాలో కొలువు దీరుతున్నాయని కొండపల్లి స్పష్టం చేశారు. ఎపి ఎస్‌హెచ్‌జి మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు 'స్వయం ఎష్టి బ్రాండ్ కింద తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఇది సువర్ణావకాశం అని, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే లక్ష్యంతో సెర్ప్. మెప్మా సంస్థలు అంకితభావంతో పనిచేస్తున్నాయని మంత్రి కొనియాడారు.

**నవరాత్రి ఉత్సవాలతో పాటు సరస్ మేళా శోభ :** ప్రసిద్ధ బెజవాడ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌తో పాటు జాతీయ సరస్ ఆజీవిక మేళా ఒకే సమయంలో జరగడం భక్తులకు, ప్రజలకు గొప్ప అవకాశమని మంత్రి తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చేవారు ఈ మేళాను సందర్శించి దేశవ్యాప్త రుచులు, వస్తువులను ఆస్వాదించవచ్చని పిలుపునిచ్చారు. ఈ మేళాలో చేనేత ఉత్పత్తులు ఉప్పాడ, వెంకటగిరి, పట్టు చీరలు, కలంకారి వస్త్రాలు, ఖాదీ దుస్తులు మరియు గృహ అలంకరణ వస్తువులతో పాటు చేతిపనుల వస్తువులైన చెక్క శిల్పాలు, టెర్రకోట పాత్రలు, జూట్ బ్యాగులు, ప్రకృతి సిద్ధమైన సబ్బులు, హెర్బల్ ఉత్పతులు కూడా ప్రదర్శనలో ఉంచుతారని తెలిపారు. చిరుధాన్యాలు (మిల్లెట్స్), సంప్రదాయ స్వీట్లు, కోల్డ్ ప్రెస్డ్ నూనెలు, నాణ్యమైన ఊరగాయలు, తేనె మరియు అటవీ సహజ ఉత్పత్తులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రసిద్ధ లైవ్ ఫుడ్ స్టాళ్లు కూడా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.

# చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ ● ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధి నివేదికను సిఎంకు అందించిన మంత్రి పయ్యావుల ● మంత్రిని అభినందించిన చంద్రబాబు



**విజయవాడ, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, వాటి వివరాలను కూడా ప్రజలకు ఎప్పటి కప్పుడు తెలియజేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ప్రజల కోసం ప్రభుత్వం ఏం చేస్తోంది? ఏ యే పనులు చేపట్టింది? వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి? అనే అంశాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాలని అభిప్రాయపడ్డారు. ఉరవకొండ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆర్థిక మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అందజేశారు. నియోజకవర్గంలో గత రెండేళ్లుగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరిస్తూ ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకచోట చేర్చి, ప్రోగ్రెస్ కార్డు తరహాలో ఈ నివేదికను ప్రచురించినట్లు తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు, హంద్రీనీవా కాలువ వెడల్పు ద్వారా కలిగిన ప్రయోజనాలు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మంజూరు, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, కొత్త భవనాల మంజూరు వంటి అంశాలను వివరించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులు, గ్రామస్థాయిలో తీసుకువచ్చిన మార్పులను సంక్షిప్తంగా పొందుపరిచినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరించారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలు నియోజకవర్గ ప్రగతిలో కీలకమైనవిగా ఈ నివేదికలో ప్రస్తావించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు, చేపట్టిన నిర్మాణ పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ఎలా ఉపయోగపడుతున్నాయనే విషయాన్ని ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. మంత్రి పయ్యావుల కేశవ్‌ను కొనియాడారు. మిగతా ఎమ్మెల్యేలు మంత్రిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి, కూటమి ప్రభుత్వంలో వికాసానికి మధ్య తేడాను వివరించేలా ఎమ్మెల్యేలు ఈ తరహా నివేదికలను, ప్రోగ్రెస్ కార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సీఎం అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనులతో పాటు.. ఆయా పనుల వివరాలను కూడా నిత్యం ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి పయ్యావుల కేశవ్‌కు సూచించారు. కాగా.. పలు అభివృద్ధి పనులకు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి.. నియోజక వర్గ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి మంత్రి పయ్యావుల ధన్యవాదాలు తెలిపారు.

# ఎపిలో స్పెషల్ టెట్ పరీక్షలు ప్రారంభం

**విజయవాడ,అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఇన్ సర్వీస్ టీచర్ల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2026(స్పెషల్ టెట్) ఆదివారం నుంచి ప్రారంభం అయింది. నేటి నుంచి ఈ నెల 15 వరకు పరీక్షలు జరుగుతాయి. ఆదివారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్పెషల్ టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 32 పేపర్లకు సీబీటీ విధానంలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఏపీలో 64, తెలంగాణలో 3, చెన్నైలో 2, బెంగళూరులో 2, బరంపురం (ఒడిశా)లో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. ఇన్ సర్వీస్ టెట్ కోసం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు దరఖాస్తులు స్వీకరించగా, మొత్తం 68,420మంది ఉపాధ్యాయులు 83,015 దరఖాస్తులు సమర్పించారు.

### వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల

# విచారణను వేగవంతం చేయాలి



● రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,అక్టోబరు11,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల విచారణను వేగవంతం చేసి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. దర్యాప్తు సంస్థల విచారణకు రాజకీయ రంగు పులమడం సరికాదని అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన జగన్‌పై విమర్శలు చేశారు. కేసుల విచారణను ఆలస్యం చేసేందుకు డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని ఆరోపించారు. జగన్ తనపై ఉన్న కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సుమారు రూ.48 వేల కోట్ల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై 2011లో సీబీఐ కేసులు నమోదు చేసిందని గుర్తుచేశారు. కంపెనీల వాటాల విలువలను పెంచడం, షెల్ కంపెనీల ద్వారా పెట్టుబడులు పెట్టించడం, మనీ లాండరింగ్‌కు పాల్పడటం వంటి ఆరోపణలు ఈ కేసుల్లో ఉన్నాయని వివరించారు. సీబీఐ కేసులు కోర్టులో ఉన్నంత మాత్రాన ఈడీ విచారణ జరపకూడదని చట్టంలో లేదని మంత్రి అన్నారు. రెండు దర్యాప్తు సంస్థల విచారణలు వేర్వేరని, ఈడీ కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలో పనిచేసే స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని పేర్కొన్నారు. ఈడీ విచారణను వేగవంతం చేసే ప్రయత్నాలకు రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు. కోర్టుల్లో డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తూ విచారణను ఆలస్యం చేస్తున్నారని జగన్‌పై ఆరోపణలు చేశారు. అయితే, కేసుల్లోని ఆరోపణలు న్యాయస్థానాల్లో నిరూపితం కావాల్సి ఉందనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును కూడా జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. అప్పట్లో చంద్రబాబు నాయుడుకు హత్యతో సంబంధం ఉన్నట్లుగా ప్రచారం చేశారని విమర్శించారు. వివేకా కుమార్తె న్యాయపోరాటం చేసి సీబీఐ విచారణకు పట్టు బట్టడంతో కేసు దర్యాప్తు ముందుకు సాగిందన్నారు. ఈ వ్యవహారంలో వచ్చిన పరిణామాలపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పజాప్రతినిధులైనా చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలని అన్నారు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలా వద్దా అనే అంశంపై నిర్ణయం తీసుకునేది న్యాయస్థానాలేనని స్పష్టం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును కూడా కేసుల్లోకి తీసుకువచ్చే పరిస్థితికి జగన్ వ్యవహారశైలి కారణమైందని మంత్రి విమర్శించారు. యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలతో తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలు తమ పని తాము చేసుకునేలా అవకాశం ఇవ్వాలని, కోర్టులు కేసుల విచారణను వేగవంతం చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కొల్లు రవీంద్ర కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల విషయంలో తుది నిర్ణయం న్యాయస్థానాలదేనని, విచారణలో వాస్తవాలు తేలిన తర్వాతే చట్టపరమైన పరిణామాలు ఉంటాయని పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో అక్రమాలపై ట్రస్టు చర్యలు

● 203 ఆసుపత్రులపై రూ.34.39 కోట్ల జరిమానాలు విధించినట్లు ట్రస్టు వెల్లడి

**విజయవాడ,అక్టోబరు11,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలులో అక్రమాలకు పాల్పడే నెట్‌వర్క్ ఆసుపత్రులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదలకు ఉచితంగా వైద్యం అందించాల్సిన ఆసుపత్రులు నిబంధనలను ఉల్లంఘించినా, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమనే సంకేతాలను వైద్యారోగ్య శాఖ ఇస్తోంది. చికిత్సల పేరుతో రోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, అర్హులకు నగదు రహిత వైద్యం నిరాకరించడం, తప్పుడు బిల్లులు సమర్పించడం వంటి అంశాలపై ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్టు ప్రత్యేకంగా దృష్టి సారించింది. 2024-25 నుంచి 2026-27 వరకు మొత్తం 203 ఆసుపత్రులపై రూ.34.39 కోట్ల జరిమానాలు విధించినట్లు ట్రస్టు వెల్లడించింది. ఇదే సమయంలో నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 44 క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. వీటిలో 25 ఆసుపత్రులపై సస్పెన్షన్లు, 13 చోట్ల చెల్లింపుల నిలిపివేత, ఐదు ఆసుపత్రులను నెట్‌వర్క్ జాబితా నుంచి తొలగించడం, మరో ఆసుపత్రి గుర్తింపును రద్దు చేయడం ఉన్నాయి. ఆసుపత్రులు సమర్పించే బిల్లుల్లో అవకతవకలను గుర్తించేందుకు ట్రస్టు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతను వినియోగిస్తోంది. జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ సహకారంతో బిల్లుల విశ్లేషణ, వైద్య రికార్డుల పరిశీలన, తనిఖీల ద్వారా అనుమానాస్పద వ్యవహారాలను గుర్తిస్తోంది. అవసరానికి మించి చికిత్సా ప్యాకేజీలను వినియోగించడం, ఒకే తరహా చికిత్సలకు అసాధారణంగా బిల్లులు సమర్పించడం వంటి అంశాలపై నిఘా ఉంచుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా బిల్లుల పరిశీలనను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా అందించాల్సిన చికిత్సలకు డబ్బులు వసూలు చేయడం, అర్హులైన రోగులకు నగదు రహిత వైద్యం నిరాకరించడం, చికిత్సలో జాప్యం చేయడం, నిర్దేశిత వైద్య ప్రమాణాలను పాటించకపోవడం వంటి ఫిర్యాదులను ట్రస్టు పరిశీలిస్తోంది. రోగుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వచ్చినా విచారణ చేపడుతోంది. రోగుల మరణాలకు సంబంధించి వైద్య నిర్లక్ష్యంపై ఫిర్యాదులు అందినప్పుడు, నిర్దేశిత చికిత్సా విధానాలను అనుసరించలేదనే ఆరోపణలు వచ్చినప్పుడు వైద్య రికార్డులను తనిఖీ చేస్తోంది. ఫిర్యాదుల స్వభావం, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు చేపడుతోంది. గడిచిన ఆరు నెలల్లో 114 కేసులకు సంబంధించి చర్యలు తీసుకున్నట్లు ట్రస్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి వరకు ప్రైవేటు ఆసుపత్రులు ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్టుతో అనుబంధంగా ఉన్న నేపథ్యంలో పథకం అమలుపై పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ వివరాలను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్టు సీఈఓ పద్మావతి వివరించారు.

పథకం కింద అర్హులైన పేదలకు నాణ్యమైన వైద్యం అందడం, ఆసుపత్రుల్లో పారదర్శకత ఉండటం, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడటం వంటి అంశాల్లో పర్యవేక్షణ కీలకంగా మారింది. ప్రభుత్వ ఆరోగ్య పథకాల అసలు లక్ష్యం రోగులకు ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడం. అందుకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడంతోపాటు, ఫిర్యాదుల పరిష్కారం, బిల్లుల తనిఖీ, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగితేనే పథకం ప్రయోజనాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందే అవకాశం ఉంటుంది.

# ఆంధ్రా - కర్ణాటకు రంజీ : తొలిరోజు బౌలర్ల హవా

● తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక 274 ఆలౌట్
● ఆంధ్రకు ఆదిలోనే ఎదురుదెబ్బ.. 16 పరుగులకే 2 వికెట్లు



**విజయవాడ, అక్టోబరు 11 (ప్రభాతవార్త ప్రతినిధి):** ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య మూలపాడు వేదికగా ప్రారంభమైన రంజీ ట్రోఫీ మ్యాచ్ తొలి రోజు బౌలర్ల ఆధిపత్యం కొనసాగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు ఆంధ్ర బౌలర్ల ధాటికి 82.2 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి ఐదు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 16 పరుగులు చేసింది. కర్ణాటక జట్టు ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రవిచంద్రన్ స్మరణ కీలక పాత్ర పోషించారు. 218 బంతులను ఎదుర్కొన్న ఆయన 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 126 పరుగులు చేసి సెంచరీ సాధించారు. వికెట్ కీపర్ కేఎల్ శ్రీజిత్ 82 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 58 పరుగులు చేశారు. ఒక దశలో కష్టాల్లో పడిన కర్ణాటక జట్టును ఈ ఇద్దరూ బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో ఆదుకుని స్కోరు బోర్డును ముందుకు నడిపించారు.

మరోవైపు కర్ణాటక జట్టులోని స్టార్ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్ తక్కువ పరుగులకే పెవిలియన్ చేరడంతో ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. ఆంధ్ర బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కర్ణాటక బ్యాటర్లను కట్టడి చేశారు.

**ఆంధ్ర బౌలర్ల సమష్టి ప్రదర్శన**

ఆంధ్ర బౌలర్లలో సౌరభ్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టగా, లలిత్ మోహన్, వెంకట్ శశికాంత్, కావూరి సాయి తేజ తలో రెండు వికెట్లు సాధించారు. త్రిపురణ విజయ్ ఒక వికెట్ తీసి కర్ణాటక ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు. ఆంధ్ర బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి జట్టును 274 పరుగులకే పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించారు. కర్ణాటక తొలి ఇన్నింగ్స్ ముగియడంతో అదే రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం ఐదు ఓవర్లలోనే 16 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం క్రీజులో అభిషేక్ రెడ్డి, షేక్ రషీద్ ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక సాధించిన 274 పరుగులకు ఆంధ్ర జట్టు ఎలా బదులిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. తొలి రోజు ఆటలో బ్యాటర్ల కంటే బౌలర్లే పైచేయి సాధించగా, రెండో రోజు ఆంధ్ర బ్యాటర్లు నిలకడగా ఆడి జట్టును పటిష్ట స్థితికి చేర్చుతారా? కర్ణాటక బౌలర్లు అదే జోరును కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాలి.

# జనసేనలోకి భారీగా చేరికలు

● పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ 100 కుటుంబాలు చేరిక

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), అక్టోబరు 11 ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదర్శాలు, నాయకత్వాన్ని బలపరుస్తూ శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం పైడిభీమవరం పంచాయతీ పరిధిలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి వడ్డాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ చేరికలు జరిగాయి. వైసీపీని వీడిన 8వ వార్డు మెంబర్ దోకల అప్పల రాముడు (అప్పన్న) సమక్షంలో మునకాల లక్ష్మణరావు, జీరు బంగారి, బుచ్చ సన్యాసి, బి.శివ, బి.గణేష్, శ్రీనివాసరావు, జి.రమణ, జి.భాష, జి.ఆదినారాయణ, ఎన్.బాల, ఎన్.అప్పారావు, బి.అప్పలసూరి, ఎం.అప్పలదుర్గ, బి.అప్పయ్యమ్మ, డి.మణికంఠ, ఎం.సురేష్, జి.పోలేరమ్మ, జి.సూర్యారావు, ఎం.రమణ, నాయన అప్పారావు, ఎన్.సంతోష్, ఎస్.సంతోష్, ఎస్.గౌరి, జె.కృష్ణ, జె.భారతితో పాటు సుమారు 100 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్న వారికి ఆ పార్టీ ఎచ్చెర్ల సమన్వయకర్త విశ్వక్సేన్, వడ్డాది శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన్, వడ్డాది శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆలోచనలతోనే రాష్ట్రానికి సువర్ణ భవిష్యత్తు సాధ్యమని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న జనసేన పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, పవన్ కళ్యాణ్ తదితరులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెల్లూరు ఆర్డీటీ కాలనీలో ఆటో డ్రైవర్ హత్య

**నెల్లూరు క్రైం, అక్టోబర్ 11, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్డీటీ కాలనీలో ఆదివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆటో పార్కింగ్ విషయంలో తలెత్తిన చిన్న వివాదం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. సేకరించిన సమాచారం మేరకు ఆర్డీటీ కాలనీకి చెందిన వరుణ్ (26) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం సాయంత్రం కూడా తన ఆటోను పార్క్ చేసే విషయంలో స్థానికంగా ఉండే ముగ్గురు తమిళ యువకులతో వరుణ్‌కు వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి వివాదం ముదరడంతో, ఆగ్రహించిన ఆ ముగ్గురు యువకులు విచక్షణారహితంగా దాడి చేసి వరుణ్‌ను హత్య చేశారు. ఈ ఘటనతో స్థానికంగా ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే నెల్లూరు రూరల్ సీఐ వెంకటరెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దారుణ హత్యతో వరుణ్ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

## ప్లాస్టిక్ వాడుక తో ప్రమాదకరం...మెగాస్టార్ చిరంజీవి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 11,ప్రభాతవార్త:** గ్రామాల్లో రోడ్ల విస్తరణ ఎంత బాగుందని గతంలో కంటే పల్లెల్లో రోడ్లు అభివృద్ధి చేశారని కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం లో బిఎస్ఎల్ సూర్య హెల్త్ కేర్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ గతంలో దేశంలో నేడు దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి రావడం పట్ల ఆయన కొనియాడారు. అలాగే ప్లాస్టిక్ రహిత సమాజం ఎంతో శ్రేయస్కరం అని,ప్లాస్టిక్ వల్ల వివిధ వ్యాధులు వ్యాపించి క్యాన్సర్ వంటి మూలకాలకు కారణమని డాక్టర్ చిరంజీవి వెల్లడిస్తూ ప్లాస్టిక్ కాకుండా తాను కూడా గాజు బాటిల్ వినియోగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. డాక్టర్ గన్ని బాస్కరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంఎల్ఏ లు వేగుళ్ళ జోగేశ్వరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఎంఎల్సీ సోము వీర్రాజు, సినీ నటుడు మురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**ఉమ్మడి తూర్పు జిల్లాలో మెగా బ్రదర్స్ సందడి:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆదివారం మెగా బ్రదర్స్ సందడి చేశారు. ఎవరికి వారు వేరు వేరు కార్యక్రమాలలో పాల్గొగా అభిమానులు వారి పర్యటనలతో జోష్ అయ్యారు. కపిలేశ్వరం మండలంలో మెగాస్టార్ చిరంజీవి హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొగా ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

### మణిద్వీప మహాసంస్థానంలో

# నవరాత్రి ఉత్సవాలు

**రాపూరు (నెల్లూరు), అక్టోబరు 11, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో ఆదివారం దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంబమైనాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం లలితాంభికా దేవికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం శ్రీ లలితా దేవి, శ్రీ మహా సరస్వతీ దేవి, శ్రీ లక్ష్మీ దేవి, శ్రీ మహా గణేశ, శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వాములకు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు, పుణ్య నదుల నుండి తీసుకోని వచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి వేదపారాయణం, శ్రీ మహారుద్రాభిషేకం, ఉత్సవ మూర్తులకు, శ్రీ లలితా దేవి, శ్రీ లక్ష్మీ దేవి, శ్రీ సరస్వతీ దేవిలకు విశేష అర్చనలు, కమలార్చన, మహా మంగళ హారతీ నిర్వహించారు. ఉదయం 10.30కి ఆశ్రమంలోని యాగశాలలో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మద్య శ్రీ అరుణ హోమం, ఆదిత్య హృదయ మూలమంత్ర హోమం, శ్రీ ఆయుష్యహోమం నిర్వహించి భగవతి కరుణామయి హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మ భక్తులకు అనుగ్రహబాషణం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన బోజన,వసతి ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పులిపాటి విజయ భరత్, పులిపాటి విజయ సింధు, పులిపాటి విజయ గోకుల్, పులిపాటి విజయ సౌమ్యలు పర్యవేక్షించారు.

## శ్రీశ్రీ జ్వాలాముఖి అమ్మవారికి పూజలో మంత్రి "ఆనం"



**ఆత్మకూరు (నెల్లూరు), అక్టోబరు 11, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీశ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మెటల్ షీట్ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం జ్వాలాముఖి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ సౌకర్యాల అభివృద్ధిలో భాగంగా భక్తుల సౌకర్యార్థం , ఆలయ అభివృద్ధికి 5లక్షల రూపాయలతో నిర్మించిన మెటల్ షీట్ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు మంత్రికి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# అత్తిలిలో డయాలసిస్ కేంద్రం

నేడే ప్రారంభం

**అత్తిలి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి, పరిసర ప్రాంతాల డయాలసిస్ రోగులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.75 లక్షలతో నూతన డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవతో ఎన్ఎండిసి సంస్థ సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసింది. ఈ కేంద్రాన్ని సోమవారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, తణుకు ఎమ్మెల్యే అరమిల్లి రాధాకృష్ణ ప్రారంభించనున్నారు. డయాలసిస్ కోసం రోగులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే అరమిల్లి రాధాకృష్ణ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి రూ.75 లక్షల నిధులు మంజూరు చేయించి కేంద్రం ఏర్పాటుకు సహకరించారు. ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో రోగులకు ప్రయాణ ఖర్చులు, శ్రమ తగ్గి స్థానికంగానే డయాలసిస్ సేవలు పొందే అవకాశం కలగనుంది.

# తిరుపతి ఈస్టు ఎస్ఐపై చర్యలు తీసుకోండి



**తిరుపతిక్రైమ్,అక్టోబర్ 11ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుపై ఆదివారం మధ్యాహ్నం దురుసుగా ప్రవర్తించి ఆయన బండి బిగాలు లాక్కుని అడ్డుకున్న తిరుపతి ఈస్టు ఎస్ఐ ప్రసాద్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ సిపిఎం ఎస్ యు సి ఐ వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. రాజకీయ పార్టీ జిల్లా కార్యదర్శి పట్ల పోలీసు అధికారి ఇంత బాధ్యతారహితంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమని, ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించిన వామపక్ష పార్టీలు, ఆదివారం కూడా నిరసన కొనసాగించాయి. ఆదివారం నిరసన ముగించుకుని నాయకులు తిరిగి బయలుదేరుతున్న సమయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు బండి వద్దకు వచ్చిన ఎస్ఐ ప్రసాద్, జరిగిన ఘటనపై నోటీసు తీసుకోమని బలవంత పెట్టడం ఆయన బండి బిగాలు లాక్కుని ఆపి, వెళ్లకుండా అడ్డుకున్నారని వామపక్ష నాయకులు సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్ ఎస్ యు సి ఐ నగర కార్యదర్శి హరీష్ లు తెలిపారు. దిష్టిబొమ్మ దహనం చేసినందుకు కేసు నమోదు చేశామని, నోటీసులు తీసుకోవాలని ఎస్ఐ దురుసుగా మాట్లాడినట్లు పేర్కొన్నారు. నోటీసులు తీసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కార్యాలయానికి వచ్చి తీసుకుంటామని నాగరాజు చెప్పినా ఎస్ఐ వినిపించుకోలేదని నాయకులు తెలిపారు. "నేను ఎస్ఐని.. నా మాట వినవా? ఇప్పుడే నోటీసులు తీసుకోవాలి" లేకపోతే కదలనిచ్చేది లేదు అంటూ అధికార దర్పంతో మాట్లాడారని, చుట్టూ ఉన్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు ఎంతగా నచ్చజెప్పినా పట్టించుకోకుండా వ్యవహరించారని విమర్శించారు. నోటీసులు ఇవ్వాలనుకుంటే చట్ట ప్రకారం వ్యవహరించాలి తప్ప, బండి బిగాలు లాక్కుని బెదిరిస్తూ వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, సీపీఐ నగర కార్యదర్శి జె. విశ్వనాథ్, సీపీఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, సిపిఎంనాయకులు ఎం. నరేంద్ర, పి. బుజ్జి, ఏ. రాధాకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు.

12 -10 Pg9th cheli FOR AP.qxd:12 -10 Pg9th cheli FOR AP.qxd 1/1/02 6:53 AM Page 1



## నేటి అలంకరణ

# శ్రీగాయత్రిదేవి



"ముక్తా విద్రుమ హేమనీల ధవళచ్ఛాయై ముక్తైస్త్రీ క్షణైః
యుక్తామిందు నిబద్ధరత్న మకుటాం తత్వార్థ వర్ణాత్మికామ్
గాయత్రీం వరదాభయాంకుశకశాశ్శుభ్రం కపాలం గదాం
శంఖం చక్రమధారవింద యుగళం హస్తైర్వహంతీం భజే"

దసరా ఉత్సవాలలో రెండవ రోజున సోమవారం దుర్గమ్మ శ్రీ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. సకల వేద స్వరూపం గాయత్రీదేవి. అన్ని మంత్రాలకు మూలశక్తి ఆ మాత. ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో శంఖం, చక్రం, గద, అంకుశం ధరించి దర్శనమిస్తుంది. ఆదిశంకరులు గాయత్రీదేవిని అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. ప్రాతఃకాలంలో గాయత్రీ దేవిగా, మధ్యాహ్నకాలం సావిత్రిగా, సాయంసంధ్యలో సరస్వతిగా ఈమె ఉపాసకులతో ఆరాధనలు అందుకుంటుంది. ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మ, హృదయంలో విష్ణువు, శిఖపై రుద్రుడు కొలువు ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. గాయత్రి మాతను ధ్యానిస్తే అనంత మంత్రశక్తి కలుగుతుంది. సకల దురిత ఉపద్రవాలు శాంతిస్తాయి. బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది. గాయత్రీ ఉపాసన వల్ల బుద్ధి తేజోవంతం అవుతుంది. గాయత్రీ మంత్రజపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుంది.

**అలంకారం :** అమ్మవారిని మెరూన్ (వక్కపొడి) వర్ణంతో ఉన్న పట్టుచీరతో అలంకరిస్తారు.

**పుష్పాలు :** తామరపూలు, కలువ పూలు

**మంత్రం:** "ఓం భూర్భువస్సువః తత స్సవితుర్వరేణ్యం భర్గో
దేవస్యధీమహి ధియో యోనః ప్రచోదయాత్" అనే
మంత్రాన్ని 108 సార్లు జపిస్తూ అమ్మను ధ్యానించాలి.

**నైవేద్యం:** పులిహోర నివేదన చేసి, గాయత్రీ స్తోత్రాలు పారాయణ చేయాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

# వాల్లో! 'పేలు'టే!



చదువు తున్నా, నిద్రపోతున్నా కొంత మంది చిన్న పిల్లలు అసంకల్పితంగా తలను గోక్కుంటూనే ఉంటారు. పేల సమస్యే ఇందుకు కారణం. చిన్నారి మనస్వి జుట్టేమో ఎప్పుడూ నిర్జీ వంగానే కనిపిస్తుంది. తల దువ్వుతుంటే చాలు చుండ్రు పొట్టులా రాలుతుంది. పిల్లల కురులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు చాలామంది తల్లులు. అలాంటివారికోసమే ఈ చిట్కాలు.

**తడి లేకుండా..** ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారులకు చెమట ఎక్కువగా పడుతుంది. పనుల ఒత్తిడో, తరవాత మాట వినరనే అనుమానమో చాలామంది తల్లులు.. తలస్నానం చేశాక తడి పూర్తిగా ఆరకుండానే రబ్బరు బ్యాండ్ పెట్టేస్తారు. ఇలా చేయడం వల్లా చుండ్రు ఇబ్బంది పెడుతుంది. జుట్టూ నిర్జీవంగా మారుతుంది. అలాకాకుండా జుట్టుని పూర్తిగా ఆరనిచ్చాక జడ వేయడం, రోజు విడిచి రోజు తప్పనిసరిగా తలస్నానం చేయడం అలవాటు చేయాలి. ఇలా చేస్తే చుండ్రు దరిచేరదు.

**పేలు లేకుండా...** తలస్నానం చేయ డానికి ముందు కప్పు కొబ్బరి నూనెలో రెండు చుక్కల వేపనూనె కలిపి తలకు రాసి మర్దన చేయండి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరి. ఇలా వారినికోసారి చేస్తుంటే సమస్య దూరమవుతుంది. లేదంటే ఆముదం కొబ్బరినూనె మిశ్రమాన్నీ పట్టించొచ్చు. వేప, ఆముదంలో ఉండే రసాయనాలు, చేదు..పేలు పారిపోయేలా చేస్తాయి.

**నిగనిగలాడేలా:** కొబ్బరినూనెలోపచ్చి ఉసిరి ముక్కలు, కాసిన్ని మెంతులు వేసి మరిగించండి. దీన్ని తలస్నానం చేయడానికి ముందు రాసుకోండి. అలానే శీకాయ, కుంకుడు కాయల్ని నీళ్లల్లో ఉడికించి రసం తీయండి. ఈ మిశ్రమాన్ని గాలిచొరని సీసాలో పోసుకుని నేచురల్ షాంపూలా వాడుకోండి. ఇవి బుజ్జాయి జుట్టుని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు నిగనిగలాడేలా చేస్తాయి. ◻

# ఫోన్ ఎవరికీ ఇవ్వొద్దు !



మన ఫ్రెండ్ కదా ! ఓసారి ఫోన్ ఇవ్వు అనగానే ఎందుకు? ఏమిటి అని అడగకుండానే ఇచ్చేస్తాం. 'ఎవరూ తెలియదమ్మా... మా వాళ్లకి ఫోన్ చేసుకోవాలి' అనగానే జాలిపడి చేస్తాం. కానీ జాగ్రత్త! ఆ నమ్మకం, జాలి మనకే ప్రమాదం కావొచ్చు. అలా ఇచ్చి దాడులు, బెదిరింపులకు జరుగుతున్న ఉదంతాలు చాలానే! అందుకే...

ఫోన్ ఇచ్చేముందు భద్రత చూసుకోండి. యాప్ పిన్నింగ్... స్మార్ట్ ఫోన్లు అన్నింటిలోనూ ఇప్పుడు ఈ ఆప్షన్ లభి స్తోంది. దాన్ని ఆన్ చేసు కోండి. అప్పుడు ఎవరైనా కాల్, క్యాలిక్యులేటర్... ఇలా ఏ అవసరానికి తీసుకున్నారో అది మాత్రమే వాడగలుగు తారు. ఫొటోలు, బ్యాంకు, ఇతర యాప్‌లు తెరవలేరు. తెలిసినవాళ్లైనా, తెలియనివాళ్లైనా కాల్ చేసుకోవాలి అంటే ఫోన్ అన్లాక్ చేసి, చేతిలో పెట్టొద్దు. స్వయంగా డయల్ చేసి ఇవ్వండి.లాక్ బటన్ నొక్కడం తప్పనిసరి.

ఎంత స్నేహితులైనా మీ స్క్రీన్‌లాక్, పిన్, పాస్‌వర్డ్ వగైరా చెప్పొద్దు. ఫొటోలు, వాట్సాప్, సోషల్మీడియా మెసేజ్ లు, పోస్టులు... వ్యక్తిగత సమాచారం కోసం వీలున్నవే వాటికి యాప్ లాక్ పెట్టుకోండి. పాస్వర్డ్, ఫింగర్ ప్రింట్ లేకుండా ఎవరూ తెరవలేరు. మీ సమా చారమూ సురక్షి తం. అయితే ఫోన్ ఇచ్చేముందు బ్యాగ్రౌండ్‌లో యాప్స్ అన్నీ తీసేసి ఇవ్వాలి. అన్నీ తీసేసి ఇవ్వాలి. చాలాసార్లు మెసేజ్, ఈమెయిల్ వగైరా చూడా లంటే ఫోన్ లాక్ తెరవాల్సిన పనే ఉండదు. లాక్ స్క్రీన్ మీద నోటిఫికేషన్లలో కనిపిస్తూ ఉంటాయి. అదీ ప్రమాదమే. ఓటీపీలు, ముఖ్యమైన సమాచారం పొరపాటున వేరే వాళ్ల చేతిలో పడగలదు. కాబట్టి, లాక్ స్క్రీన్ మీద అది కనిపించకుండా నోటిఫికేషన్ ప్రివ్యూని ఆఫ్ చేయడం మేలు. ఫొటోలు, వీడియోలు చూపిస్తూ ఒక్కోసారి ఫోన్ ఇస్తుంటాం. చిక్కుల్లో పడటానికి చిన్న ఏమరుపాటు చాలు. కాబట్టి. అలా ఇవ్వాల్సి వస్తే మీరు దగ్గరే ఉండండి. తెలియని వాళ్లు, ఎక్కువగా ఉన్నచోట మరీ జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఫోన్ తీసుకుని పారిపోవచ్చు. ఎవరికైనా ఫోన్ ఇచ్చాక ఓసారి చెక్ చేసుకోండి. కొత్త యాప్‌లు వేయడం, సెట్టింగులు మారడం, బ్యాంకు, సోషష్ మీడియా అకౌంట్లు తెరిచినట్లు అనిపిస్తే... వాటి పాస్ వర్డ్లను మార్చడమే మంచిది. ఇటీవల ఒకమ్మాయి... అలా ఫోన్ ఇచ్చే దాడికి గురైంది. ఇంకొకరు సైబర్ దాడికి ప్రయత్నించారు. గమనించాలే కానీ... ఇలాంటి సంఘటనలు చాలానే! తెలిసిన శత్రువుతో కంటే స్నేహితుల ముసుగులో ఉండే నమ్మక ద్రోహులతోనే ప్రమాదం. కావాలని కాకపోయినా తెలిసో తెలియకో కూడా కొన్నిసార్లు మన ఫొటోలు, వివరాలు చేయొచ్చు. బెదిరింపులు, డబ్బులు నష్టం వగైరా ఎదుర్వచ్చు. అవన్నీ వద్దంటే జాగరూకత కావాల్సిందే! ◻

## నేడు ముద్దపప్పు బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లోమూడవ రోజు తంగేడు, గునుగు, బంతి, చేమంతి తదితర పూలను మూడు ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు. ఈ రోజు నైవేద్యం : శనగపప్పు, బెల్లం, పాలు

# భక్తితో గుడాన్నం



తమిళనాడులో మధుర మీనాక్షీ, మైసూర్ చామండేశ్వరీ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో గుడాన్నాన్ని నివేది స్తారు. పర్వదినాల్లో పరమాన్నం చేయడం మనందరికీ తెలిసిందే. నిజానికి సరైన కొలతలతో చేస్తే రుచి రెట్టింపు అవుతుంది. అదెలాగంటే.. ముందుగా కుక్కర్లో అరకప్పు బియ్యంలో ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి గంటసేపు నాన బెట్టాలి. చిట్టి ముత్యాల బియ్యం వాడితే గూడా న్నం చాలా రుచిగా ఉంటుంది. ఇవిలేకపోతే మనం రోజూవాడే బియ్యంతోనే చేసు కోవచ్చు. నాలుగు విజిల్స్ వచ్చేంతవరకూ ఉడికించి బాగా మెదుపుకోవాలి. రెండు కప్పుల బెల్లంలో పావుకప్పు నీళ్లు పోసి కరిగించాలి. బెల్లం ఎప్పుడూ బియ్యానికి నాలుగు రెట్లు ఉండాలి. పాత బెల్లం అయితే అన్నానికి మంచి రంగు వస్తుంది. కరిగిన బెల్లాన్ని వడకట్టుకోవాలి. దీంట్లో అన్నం కలిపి తక్కువ మంట మీద పావుగంటపాటు ఉడికించుకోవాలి. టేబుల్‌స్పూన్ చొప్పున నెయ్యివేసు కుంటూ మధ్యలో కలుపుతూ ఉండాలి.

దీనికి అరకప్పు వరకూ నెయ్యి అవసరం అవుతుంది. దీంట్లో రెండు చిటికెల పచ్చ కర్పూరం, చిటికెడు యాలకుల పొడి వేసి బాగా కలిపి దించేయాలి. చివరగా కొంచెం నేతిలో గుప్పెడు జీడిపప్పు వేసి ఎర్రగా వేయించి గుడాన్నంలో కలపాలి. తర్వాత గూడాన్నం ప్రీత మానస అంటూ అమ్మవారిని శ్రద్ధాభక్తులతో ప్రార్థిస్తూ నివేదించడమే.దీన్ని అరటిపండు ముక్కతోకలిపి తమిళనాడు లోని ఆలయాల్లో భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. ◻

## చిట్కా

- ఇంటిపని, వంటపని చేస్తున్నప్పుడు మెత్తని స్పాంజితో తయారుచేసిన చెప్పులనే వాడాలి.
- చెప్పులు షూలు పెట్టుకునేందుకు స్టాండ్స్ వాడాలి.
- పొడి చర్మం గలవారు వారానికి ఒకసారి గోరువెచ్చటి నూనెలో పాదాలు కాసేపు వుంచాలి.
- జీర్ణకోశ ఇబ్బందులకు ఆపిల్ ముక్కలకు తేనెకలిపి తీసుకుంటే జీర్ణకోశ ఇబ్బందులు ఉండవు. ◻

# విజయవంతంగా ముగిసిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ 3 రోజుల స్పెయిన్ పర్యటన..

- ఎపి పర్యాటక రంగానికి గ్లోబల్ గుర్తింపు లభించేలా మంత్రి దుర్గేష్ ప్రత్యేక కృషి

**అమరావతి,అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల స్పెయిన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పునరుద్ధ రించడానికి, అంతర్జాతీయ పెట్టుబడు లను ఆకర్షించడానికి, నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడానికి మంత్రి దుర్గేష్ ఈ పర్యటనలో చేసిన కృషి విశేష ప్రశంసలు పొందింది.ా స్పెయిన్‌లోని సెవిల్లె నగరంలో జరిగిన ప్రతిష్టాత్మక ఖీటూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్2026ఖీ లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని చేసిన ప్రసంగం, ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.. గ్లోబల్ టూరిజం ట్రెండ్స్, స్మార్ట్ డెస్టినేషన్స్, సుస్థిర పర్యాటక విధానాలపై పర్యాటక నిపుణులతో మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపుదిద్దుకున్న వినూత్న మోడల్ ను మంత్రి దుర్గేష్ ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు. ఎక్స్గర్ సంస్థ సహకారంతో ఏపీలోని 100కు పైగా ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు తమ సొంత భాషలోనే సమాచారం అందించేలా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్పెయిన్‌కు చెందిన పలు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పర్యాటక సంస్థలతో మంత్రి దుర్గేష్ నేరుగా సమావేశమయ్యారు. సుదీర్ఘ తీరప్రాంతంలో వెల్ నెస్ సెంటర్లు, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, రిసార్టుల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సమ్మిట్‌లో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. .."మీరు ఇప్పటికే భారతదేశాన్ని చూశామని భావిస్తే.. ఒక్కసారి ఆంధ్రప్రదేశ్ వచ్చి చూడండి, మేము మిమ్మల్ని ఖచ్చితంగా ఆశ్చర్యపరుస్తాం".. అని పిలుపునివ్వడం గ్లోబల్ డెలిగేట్లను విశేషంగా ఆకట్టుకుంది. పర్యటన అనంతరం విజయవాడ చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ స్పెయిన్ పర్యటన ద్వారా లభించిన అనుభవాలు, ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడుల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.. మీ సందర్భంగా స్పెయిన్ లో తనకు లభించిన ఆతిథ్యం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.

# భవిష్యత్తు అంతా మీదే... వారితోనే ప్రపంచ సమస్యలకు పరిష్కారం

## సరైన లక్ష్యాలతో యువత సాగాలి:చెన్నైలో ప్రధాని మోడీ

**చెన్నై, అక్టోబరు 11:** ప్రపంచానికి ప్రస్తుతం ఎంతో అవసరమైన పరిష్కారాలను అందించే సామర్థ్యం జెన్ జెడ్ యువతకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. యువత తమ భవిష్యత్తును విశాల దృక్పథంతో చూడాలని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చెన్నైలోని నందంబాక్కంలో ఉన్న చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకల్లో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి అవసరమైన కొత్త ఆలోచనలు, పరిష్కారాలు దేశ భవిష్యత్తుతోపాటు ప్రపంచ భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ప్రపంచం ప్రస్తుతం అనేక సమస్యలకు పరిష్కారాల కోసం ఎదురుచూస్తోందని, వాటిని అందించే సామర్థం యువతలో ఉందని అన్నారు. ప్రతి యువకుడు తన భవిష్యత్తును విశాలమైన లక్ష్యాలతో ముడిపెట్టుకోవాలని సూచించారు. ఇది మీ సమయం మీకు లభించిన గొప్ప అవకాశమని



మోడీ పేర్కొన్నారు. తాను కాశీకి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, వారణాసి తన లోక్‌సభ నియోజకవర్గమని ప్రధాని గుర్తుచేశారు. నిర్భయంగా జీవించాలనే స్ఫూర్తినిచ్చే మహాకవి సుబ్రహ్మణ్య భారతి రచనలను ప్రస్తావిస్తూ, యువత తమ ఆలోచనలకు అవకాశం కల్పించాలని సూచించారు. మీ ఆలోచనలపై పనిచేయండి. పెద్ద కలలు కనండి. విభిన్నంగా ఆలోచించండి. భయం లేకుండా ముందుకు సాగండి. భారతదేశంలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఇది మీ సమయం, మీకు లభించిన అవకాశం. మనమంతా కలిసి సాధించగలమని మోడీ అన్నారు. దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో మోడీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లు అందులో పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు యువతతో సంబంధాలను బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే చెన్నైలో మోడీ చేసిన ప్రసంగాన్ని కొందరు రాజకీయ పరిశీలకులు చూస్తున్నట్లు నిపుణుల అంచనా. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి సొంతంగా సంపూర్ణ మెజారిటీ లేదని, నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత కొరవడిందనే భావన యువతలో అసంతృప్తికి కారణమవుతోందన్నది విశ్లేషకుల వాదనగా ఉంది.

# జిబౌటి తీరంలో పడవ మునక

## 109 వలసదారులు మృతి

**జెనీవా, అక్టోబరు 11:** జిబౌటి తీరంలో మధ్య రాత్రి జరిగిన ఘోర పడవ ప్రమాదంలో కనీసం 109 మంది వలసదారులు మృతి చెందగా, మరో 116 మంది గల్లంతయ్యారు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. జిబౌటి నుంచి యెమెన్‌కు 350 మందితో ప్రయాణిస్తున్న పడవ జిబౌటిలోని ఓబాక్ పట్టణానికి ఉత్తరాన సముద్రంలో బోల్తా పడినట్లు ప్రాణాలతో బయటపడిన వారు తెలిపారని ఐఓఎం తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనపై జిబౌటిలో ఐఓఎం మిషన్ చీఫ్ అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ాఇది ప్రాణనష్టంతో కూడిన విషాదకర ఘటన. ప్రాణాలతో బయటపడిన వారికి, తమ ఆత్మీయులను కోల్పోయిన లేదా వారి ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్న కుటుంబాలకు మా సానుభూతి తెలియజేస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు. బాధితులకు అత్యవసర సహాయం అందించేందుకు జిబౌటి అధికారులతో కలిసి ఐఓఎం బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రమాదంలో మృతదేహాలుగా గుర్తించిన 109 మందిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నట్లు ఐఓఎం వెల్లడించింది. ఈ ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారంతా ఇథియోపియా దేశస్థులేనని తెలిపింది. పేదరికం, అభద్రత, వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా అనేక మంది మెరుగైన ఆర్థిక అవకాశాల కోసం ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధమవుతున్నారని ఐఓఎం పేర్కొంది. బాబ్ ఎల్‌మందెబ్ జలసంధిని దాటి యెమెన్కు చేరుకుని, అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వలసదారులు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. మధ్యప్రాచ్యంలో అస్థిర పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయని వివరించింది. యెమెన్లో సౌదీ అరేబియా మద్దతు ఉన్న ప్రభుత్వ దళాలకు, ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య పోరాటం కొనసాగుతోంది. ఇరాన్పై అమెరికా, దాని మిత్రదేశాలు పాల్గొంటున్న ప్రాంతీయ సంఘర్షణలో హౌతీలు కూడా భాగస్వాములయ్యారు. ప్రమాదం నుంచి బయటపడిన వారిలో 64 మందికి ఓబాక్లోని వలసదారుల కేంద్రంలో ఐఓఎం సహాయం అందిస్తోంది. గల్లంతైన వారి కోసం జిబౌటి అధికారులు గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని సంస్థ తెలిపింది.

# కరుణించు తల్లి దుర్గమ్మ

## వాడ.వాడల ఆరంభమైన శ్రీదేవినవరాత్ర ఉత్సవాలు

**విజయవాడ,అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా శాక్తేయ దేవాలయాల్లోఅమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. వాడ,వాడలో శ్రీ దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు వెలిసాయి.ఇక ఆలయాల్లో పదిరోజుల పాటు అమ్మవార్లు విశేష అలంకరాల్లో దర్శనం ఇవ్వనున్నారు. దసరా నవరాత్రులు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు.విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దుర్గమ్మ బాలాత్రిపురసుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకార పూజలు నిర్వహించారు. భక్తులను ఉదయం 8 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. రాత్రి 11 గంటల వరకూ దర్శనాలు కొనసాగుతాయి.విజయవాడలో దుర్గమ్మ ఆలయంలోను,పాత బస్తీ(వన్‌టౌన్) ప్రాంతంలోను అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి.దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పశ్చిమగోదావరి జిల్లాలో వేర్వేరు చోట్ల వైభంగా మొదలయ్యాయి. తణుకు మండలం మండపాకలో ఎల్లారమ్మ ఆలయంలో కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు పది రోజులపాటు జరగనున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. శరన్నవరాత్రుల మొదటి రోజు అమ్మవారు ముగ్ధ మనోహరమైన రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తణుకులోని కనకదుర్గ అమ్మవారి రజిత కవచాలంకృత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి.

**శ్రీశైలంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు :**

శరన్నవరాత్రులలో భాగంగా తూర్పుగోదావరిజిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగిలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాల ప్రారంభం రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు నిర్వహిస్తున్నారు. అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం మహా క్షేత్రం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయ ప్రాంగణాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారు భక్తులకు శ్రీ భ్రమరాంబ దేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.



అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనూ శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయాలు ముస్తాబు అయ్యాయి. పి. గన్నవరం నియోజకవర్గంలోని అంబాజీపేట. అయినవిల్లి, పి,గన్నవరం మామిడి కుదురు మండలాల్లో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని కోటదుర్గమ్మ దేవస్థానంలో నేడు అమ్మవారు నిజరూప దర్శనంలో దర్శనం ఇచ్చారు. దసరా నేపథ్యంలో పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

**1108 కలశాలతో నగరోత్సవం :** బాపట్ల జిల్లా చీరాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చీరాల సంతబజార్ లో కొలువై ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. 1108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు. పసుపు, కుంకుమలతో మహిళలు శాస్త్రోక్తంగా జలాభిషేకం చేశారు. అనంతరం కనకధారా పారాయణం చేశారు. అమ్మవారికి చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గామాత శరన్నవరాత్రులు పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో కలశాలతో భవాని భక్తులు భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పులు మేళాలతో నృత్యాలు చేస్తూ కలశాల వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక దుర్గాలమ్మ చెట్టు అమ్మవారి ఆలయ వద్ద మహిళా భక్తులు ఆలయ ప్రదర్శన చేశారు.

మార్కాపురం జిల్లా గిద్దలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన రహదారిపై విద్యుత్ కాంతులతో వెదజల్లుతున్న అమ్మవారి చిత్రపటం ఏర్పాటు చేశారు. నేటి నుంచి పది రోజులపాటు అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఆట

# ఛాంపియన్‌గా శుభంకర్



**గ్రేటర్ నోయిడా:** గ్రేటర్ నోయిడాలోని జేపీ గ్రీన్స్ గోల్ఫ్ స్పా రిసార్ట్‌లో జరిగిన రూ.2 కోట్ల కపిల్ దేవ్ ఇన్విటేషనల్ టూర్ ఛాంపియన్‌షిప్‌లో శుభంకర్ శర్మ ఆరు స్ట్రోక్‌ల తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. 30 ఏళ్ల ఈ గోల్ఫ్ క్రీడాకారుడు చివరి రౌండ్‌లో మూడు అండర్ 69 స్కోరు నమోదు చేసి మొత్తం 14 అండర్ పార్‌తో ముగించాడు. అతని నాలుగు రౌండ్ల స్కోర్లు 68, 65, 72, 69గా నమోదైంది. రెండు షాట్ల ఆధిక్యంతో రోజును ప్రారంభించిన శర్మ , పార్ ఫైవ్ 12వ హోల్‌లో ఒక ఈగిల్ , మూడు బర్డీలు మరియు రెండు బోగీలతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇటలీకి చెందిన మిషెల్ ఒర్టోలాని (727065 73), బెంగళూరుకు చెందిన మనోజ్ ఎస్ (70716673) ఎనిమిది అండర్ 280 స్కోరుతో సంయుక్తంగా రెండవ స్థానాన్ని పంచుకున్నారు. శర్మ ఫైనల్ రౌండ్‌ను ప్రారంభంలో మూడు బర్డీలతో మొదలు పెట్టినప్పటికీ రౌండ్ మధ్యలో రెండు బోగీలు చేయడంతో ఒర్టోలానీ ఆధిక్యాన్ని తగ్గించుకోగలిగాడు. 10 వ హోల్‌లో అతను చేసిన బోగీ పోటీని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. పార్ ఫైవ్ 12వ హోల్ వద్ద టర్నింగ్ పాయింట్ వచ్చింది. శుభ్ సుమారు 60 నుండి 70 అడుగుల దూరం నుండి పుట్ చేసి ఈగిల్ సాధించాడు. తర్వాత చివరి హోల్స్‌లో తన ఆధిక్యాన్ని కాపాడుకోవడానికి తన షార్ట్ గేమ్ మరియు పుట్టింగ్‌పై ఆధారపడ్డాడు. 16 వ హోల్‌లో గాలికి అతని టీ షాట్ ఒక చెట్టు వెనుకకు నెట్టబడటంతో అతను ఖాళీ ప్రదేశం నుండి కష్టమైన రికవరీ మరియు చిప్ ఆడవలసి వచ్చింది. చివరికి ఆరు షాట్ల తేడాతో గెలిచి టైటిల్ సాధించాడు.

# ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్.. ఎయిర్ పిస్టల్‌లో సిద్ధూకు స్వర్ణం



**ఈజిప్టు:** ఈజిప్టులోని కైరోలో ఆదివారం జరిగిన 2026 ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారతానికి చెందిన ఉదయవీర్ సిద్ధూ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 24 ఏళ్ల అతను ఫైనల్‌లో మొత్తం 240.6 స్కోరు సాధించి, వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకున్న జర్మనీకి చెందిన క్రిస్టియన్ రీట్జ్ (240.1), ఇటలీకి చెందిన పాలో మోన్నా (219.8)లను అధిగమించి నిలిచాడు. ఉదయవీర్ అంతకుముందు 585 19 స్కోరుతో నాలుగో స్థానంలో ఫైనల్‌కు అర్హత సాధించాడు. బరిలో ఉన్న మరో భారతీయుడు, జోనాథన్ గావిన్ ఆంటోనీ, క్వాలిఫికేషన్‌లో రెండవ స్థానంలో నిలిచాడు. కానీ అతను కేవలం ర్యాంకింగ్ పాయింట్ల కోసం మాత్రమే పోటీ పడ్డాడు. అజేంద్ర సింగ్ చౌహాన్, సరబ్‌జోత్ సింగ్ క్వాలిఫికేషన్‌లో వరుసగా 14వ, 31వ స్థానాల్లో నిలిచి ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.



# వన్డేల్లో ఫాస్టెస్ట్ బ్యాటర్లు

## వేగంగా 9 వేలు చేసిన రన్నర్స్

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్ చరిత్రలో 9 వేల పరుగుల మైలురాయిని చేరుకోవడం ఏ బ్యాటర్‌కైనా ఎంతో ప్రతిష్టాత్మకం. తక్కువ ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించడం వారి స్థిరమైన ప్రదర్శనకు నిదర్శనం. ఈ జాబితాలో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని స్పష్టంగా చాటుకున్నారు. ప్రపంచంలోని టాప్5 ఫాస్టెస్ట్ బ్యాటర్లలో ఏకంగా నలుగురు టీమిండియా దిగ్గజాలే ఉండటం భారత క్రికెట్ రికార్డుల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. ఈ జాబితాలో భారత రన్ మెషిన్ విరాట్ కోహ్లి వన్డేల్లో అత్యంత వేగంగా 9 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ మైలురాయిని చేరుకోవడానికి కోహ్లికి కేవలం 202 మ్యాచ్‌లు, 194 ఇన్నింగ్స్‌లు మాత్రమే పట్టాయి. నిలకడైన బ్యాటింగ్ తీరు, గొప్ప ఛేజింగ్ స్కిల్స్‌తో విరాట్ ఈ ఆల్‌టైమ్ రికార్డులో మొదటి స్థానంలో నిలిచి తన అగ్రస్థానాన్ని కాపాడుకుంటున్నాడు. అలాగే సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ ఏబీ డివిలియర్స్ ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. మైదానం నలుమూలలా వినూత్న షాట్లతో విరుచుకుపడే డివిలియర్స్ 214 మ్యాచ్‌లలో 205 ఇన్నింగ్స్‌లు ఆడి 9 వేల పరుగుల మార్కును దాటాడు. తన వేగవంతమైన బ్యాటింగ్ శైలితో ఎన్నో మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికాకు ఒంటిచేత్తో విజయాలు అందించిన ఘనత ఇతనికి ఉంది. టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (హిట్‌మ్యాన్) ఈ రికార్డు జాబితాలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రోహిత్ 224 మ్యాచ్‌లలో 217 ఇన్నింగ్స్‌లు తీసుకుని ఈ మైలురాయిని అధిగమించాడు. వన్డేల్లో మూడు ద్విశతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడిగా రోహిత్ శర్మ క్రీడా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇక మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 236 మ్యాచ్‌లలో 228 ఇన్నింగ్స్‌లు ఆడి నాలుగో స్థానంలో నిలిచారు. గంగూలీ 2004లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించారు. ఇక క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ 242 మ్యాచ్‌లలో 235 ఇన్నింగ్స్‌లు ఆడి ఐదో స్థానంలో నిలిచారు. అప్పట్లో వన్డే క్రికెట్‌లో అతివేగంగా ఈ ఘనత సాధించిన ఆటగాడిగా సచిన్ రికార్డు సృష్టించారు.

# నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్.. జాతీయ ఛాంపియన్లుగా వైదేహి, కేశర్వాణి



**న్యూఢిల్లీ:** ఫెనెస్టా ఓపెన్ నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో టాప్ సీడ్ వైదేహిచౌధరి, ఆరో సీడ్ మాన్ కేశర్వాణి వరుసగా మహిళల, పురుషుల సింగిల్స్ టైటిళ్లను కైవసం చేసుకున్నారు. రెండు గంటల 15 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో 20 ఏళ్ల శృతి అహ్లావత్‌ను 6-4, 7-5 తేడాతో ఓడించిన వైదేహి తన మూడవ ఫెనెస్టా ఓపెన్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. మొదటి సెట్‌లో 5-3 ఆధిక్యంలో ఉన్నప్పటికీ ఆమె పోరాడుతూనే ఉంది. రెండో సెట్‌లో కూడా 5-3 ఆధిక్యంలో ఉన్నా, ఆమె చివరి వరకు పోరాడుతూనే ఉంది. అలాగే పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో, కేశ ర్వాణి ఒక గంట 37 నిమిషాల పోరులో మూడో సీడ్ నితిన్ సిన్హాను 6-0, 6-4తేడాతో ఓడించి తన తొలిఫెనెస్టా ఓపెన్ టైటి ల్‌ను కైవసంచేసుకున్నాడు. కేశర్వాణి ఆధిపత్యంతో ఆటను ప్రారం భించి మొదటి ఆరుగేమ్‌లను గెలుచుకొని, ఒక్కగేమ్ కూడా కోల్పో కుండా తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్ మరింత పోటీగా సాగినా ఆరో సీడ్ ఆటగాడు 3-2 వద్ద ఒక కీలకమైన బ్రేక్ సాధించి, ఆ తర్వాత తన సర్వ్‌ను నిలబెట్టుకొని మ్యాచ్‌ను ముగించాడు. మరోవైపు, 10వ సీడ్ అయిన 16 ఏళ్ల రిభవ్ సరోహా, నాలుగో సీడ్ ఓంరమేష్ పటేల్‌ను 6-4,6-3 తేడాతో ఓడించి బాలురఅండర్18 సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.

# వరల్డ్ ఛాంపియన్‌గా చైనా

**కైరో:** ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో మలేషియాను ఓడించి, బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ 2026 టైటిల్‌ను చైనా మరోసారి కైవసం చేసుకుంది. మూడు గేమ్‌ల ఫైనల్‌లో, మలేషియా గట్టి పోటీనిచ్చినప్పటికీ తట్టుకుని, నిర్ణయాత్మక గేమ్‌లో తిరిగి పట్టు సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న చైనా జట్టు 55-46, 55-53, 55-45 స్కోరుతో విజయం సాధించింది. తొలి గేమ్‌లో చైనా ఆధిపత్యం చెలాయించడంతో, ఈ పోటీ ఆ దేశానికే సునాయాస విజయం దక్కేలా కనిపించింది. అయితే మలేషియా పుంజుకుని, ఫైనల్‌ను హోరాహోరీ పోరుగా మార్చింది. పురుషుల సింగిల్స్‌లో 18-22 స్కోరు వద్ద టియూ వెయ్ జీ బాటన్‌ను అప్పగించడంతో, మలేషియా డబుల్స్ బృందం తమ టైటిల్



ఆశలను సజీవంగా ఉంచుకునే యత్నం చేసింది. మహిళల డబుల్స్‌లో జెనెవీ లిమ్, లో జి యు, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇర్ఫాన్ షాజ్మిర్, జెనెవీ లిమ్, అలాగే పురుషుల డబుల్స్‌లో షాజ్మిర్, అహ్మద్ రెడ్జువాన్ రాణించి, మలేషియా రెండవ గేమ్‌ను 55-53 తేడాతో గెలుచుకుని, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీయడంలో సహాయపడ్డారు. చైనా త్వరగానే తమ ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పి, మలేషియా మొదటి ఇద్దరు సింగిల్స్ ఆటగాళ్లను కలిపి 9పాయింట్లకే పరిమితం చేసి,ఆధిక్యాన్ని సంపాదించింది.

# ఇంటర్ మయామి ఘన విజయం

## డిసి యునైటెడ్ 4-0 తేడాతో ఓటమి



**మయామి:** కెప్టెన్ లియోనెల్ మెస్సీ, స్ట్రైకర్ లూయిస్ సువారెజ్ చెరో రెండు గోల్స్ చేయడంతో ఇంటర్ మయామి సిఎఫ్, డిసి యునైటెడ్‌పై 4-0 తేడాతో ఘన విజయం సాధించింది. ఆట ఆరంభంలోనే ఇంటర్ మయామి ఖాతా తెరిచింది, 3వ నిమిషంలో సువారెజ్ ఈ రెగ్యులర్ సీజన్‌లో తన 14వ గోల్‌ను సాధించాడు. సువారెజ్, తొలి ప్రయత్నంలోనే బంతిని గోల్‌లోకి పంపాడు. మరోవైపు, 16వ నిమిషంలో దీది ఆటగాడు తాయ్ బరిబో చేసిన ప్రయత్నాన్ని సెయింట్ క్లెయిర్ అద్భుతంగా అడ్డుకుని, ఆధిక్యాన్ని నిలబెట్టాడు. ఆ తర్వాత 39వ నిమిషంలో, బెర్టెరామే తలతో అందించిన అసిస్ట్‌ను సద్వినియోగం చేసుకుంటూ, పెనాల్టీ ఏరియా లోపలి నుండి గోల్ చేసి సువారెజ్ ఇంటర్ మయామి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి తన బ్రేస్‌ను పూర్తి చేశాడు. రెండవ అర్ధభాగంలో కూడా మయామి తన అద్భుతమైన దాడి ప్రదర్శనను కొనసాగించింది. 60వ నిమిషంలో మెస్సీ ఒక అద్భుతమైన సోలో ప్రదర్శనతో తన రెండవ గోల్‌ను పూర్తి చేసి, ఇంటర్ మయామికి విజయాన్ని ఖాయం చేశాడు. తుది విజిల్ మోగేంత వరకు 40 స్కోరు అలాగే కొనసాగింది, దీంతో ఇంటర్ మయామి తిరిగి విజయాల బాట పట్టి విలువైన మూడు పాయింట్లను కైవసం చేసుకుంది. ఈ విజయంతో, ఇంటర్ మయామి దీది యునైటెడ్‌పై తన అజేయ పరంపరను ఏడుకు (5 విజయాలు, 2 డ్రాలు) పొడిగించింది.

# శరవేగంగా వృద్ధి చెందనున్న భారత్

## ఈ యేడాది 7.3 శాతం వృద్ధి అంచనా




**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ప్రపంచ ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ వాణిజ్యం మందగించే పరిస్థితులు నెలకొన్నప్పటికీ, 2026లో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగనుందని ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ యుఎన్‌టాడ్ అంచనా వేసింది. ఈ యేడాది భారత ఆర్థిక వృద్ధి రేటు 7.3 శాతంగా ఉండవచ్చని తన ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ రిపోర్ట్‌లో పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఆసియా కీలక చోదకశక్తిగా నిలవనుందని వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 2.6 శాతంగా ఉండవచ్చని, అభివృద్ధి చెందుతున్న దేశాల వృద్ధి రేటు సైతం గత ఏడాది 4.7 శాతం నుంచి ఈ యేడాది 4 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో ఆసియా వాటా 59 శాతంగా ఉండవచ్చని నివేదిక పేర్కొంది. భారత్‌తో పాటు ఇండోనేషియా, చైనా దేశాలు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయి. భారత్ 7.3 శాతం ఇండోనేషియా 5.2 శాతం చైనా 4.5 శాతం భారత్‌లో బలమైన దేశీయ డిమాండ్, తయారీ రంగం విస్తరణ, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థిక వృద్ధికి మద్దతునిస్తు న్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఈ అంశాలు భారత ఆర్థిక వ్యవ స్థకు బలాన్నివ్వనున్నాయని అంచనా. యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు కొనసాగినప్పటికీ, 2025లో ప్రపంచ వాణిజ్యం రికార్డు స్థాయిలో 35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఎఐ రంగం ద్వారా లభిస్తున్న ఆర్థిక ప్రయోజనాలు ప్రస్తుతం పరిమిత సంఖ్య లోని దేశాలు, సరఫరాదారులకే ఎక్కువగా దక్కుతు న్నాయని యుఎన్‌టాడ్ విశ్లేషించింది. ఇంధన ధరల పెరుగుదల, ఎఐ ఆధారిత వృద్ధిపై అనిశ్చితి, అభివృద్ధి నిధుల తగ్గుదల ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక అసమానతలు మరింతపెంచే ప్రమాదం లేకపోలేదని అప్రమత్తంచేసింది.

# భారత్‌లో విద్యుత్ కార్ల తయారీకి ఆడి ఇండియా యోచన



**ముంబయి, అక్టోబరు 11:** ఆడికంపెనీ విద్యుత్ వాహనాలను స్థానికంగా తయారు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు లగ్జరీ కార్ల తయారీ సంస్థ వెల్లడించింది. దీనిపై వచ్చే రెండు నెలల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కంపెనీ ఉన్నతాధికారి తెలిపారు. వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో దేశంలోని లగ్జరీ కార్ల మార్కెట్లో తమ వాటాను ప్రస్తుతమున్న సుమారు 8శాతం నుంచి 15-16 శాతానికి పెంచు కోవాలని సంస్థలక్ష్యంగాపెట్టుకుంది. ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ కంపెనీ భవిష్యత్ వ్యూహాలను వివరించారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడం, కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడం, డీలర్‌షిప్ నెట్వర్క్‌ను విస్తరించడం ఆధారంగా వృద్ధిని సాధిం చాలని భావిస్తున్నట్లు తెలిపారు. భారత్‌లో బ్యాటరీ ఎలక్ట్రిక్‌కారును స్థానికంగా తయారు చేసే అంశంపై చర్చిస్తున్నామని ధిల్లాన్ వెల్లడించారు. దీనిపై వచ్చే రెండు నెలల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. స్థానిక తయారీ ద్వారా భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలని కంపెనీ భావిస్తోంది. ప్రతిపాదిత భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారత్‌లోకి మరిన్ని కార్ల మోడళ్లను తీసుకురావడా నికి అవకాశాలు ఏర్పడతాయని ఆడి భావిస్తోంది. దిగుమతి సుంకాలు పోటీకి అనుకూలంగా మారితే, కొత్త మోడళ్లను భారత మార్కెట్లో ప్రవేశపెట్టి వాటికి ఉన్న డిమాండ్‌ను పరీక్షించవచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. మార్కెట్లో విక్రయ అవకాశాలు, డిమాండ్ అంచనావేయడానికి ఎఫ్టీఏ మాకు మరిన్ని మోడళ్లను భారత్‌కుతీసుకురావడంలో సహాయపడు తుందని ధిల్లాన్ తెలిపారు. తమ ప్రధాన మోడళ్లకు స్థానిక తయారీపై ఆధారపడటం కొనసాగిస్తామని, అదే సమయంలో దిగుమతులద్వారా భారత వినియోగదారులకు అందుబాటులో ఉండే కార్ల శ్రేణిని విస్తరించనున్నట్లు వివరించారు. ప్రతి పాదిత భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం భారత ఆటోమొబైల్ పరిశ్రమకు కూడా ఎగుమతి అవకాశా లను అందించగలదని ధిల్లాన్ అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం ఇరువైపులా మార్కెట్లను మరింతగా తెరిచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఈ వారం స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు



**ముంబయి, అక్టోబరు 11:** ద్రవ్యోల్బణ గణాంకాలు, కంపెనీల క్యూ2 ఫలితాలపై ఇన్వెస్టర్ల దృష్టి ముడి చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ పరిణామాలతో భారతస్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణుల అంచనా. ప్రధాన కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలు, అంతర్జాతీయ ఆర్థిక సూచీలు, ముడి చమురు ధరల కదలికలు మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కార్యకలాపాలు, రూపాయి మారకం విలువ, అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపను న్నాయి.

సెప్టెంబర్ నెలకు సంబంధించిన వినియోగ దారుల ధరల సూచీ, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యో ల్బణ గణాంకాలు ఈ వారం దేశీయ మార్కెట్లకు కీలకం కానున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగడం భారత ఈక్విటీ మార్కెట్లకు ప్రధాన రిస్క్‌గా మారింది. చమురు ధరలు నిరంతరం పెరిగితే ద్రవ్యోల్బణం, రవాణా వ్యయాలు పెరగడంతో పాటు కంపెనీల లాభాల మార్జిన్లపై ఒత్తిడి పడే అవకాశం ఉందని రాధా కృష్ణన్ వివరించారు. టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా ఇంధనం, రవాణా వ్యయాల పెరుగుదల ఉత్పత్తిదారులపై చూపుతున్న ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడను న్నాయి. అమెరికా ద్రవ్యోల్బణం, ఉపాధి గణాం కాలు, రిటైల్ అమ్మకాల వివరాలు డాలర్ విలువ, ట్రెజరీ బాండ్ రాబడులపై ప్రభావం చూపవచ్చు. యూరప్ ద్రవ్యో ల్బణ గణాంకాలు, బ్రిటన్ ఆర్థిక వృద్ధి వివరాలపైనా మార్కెట్‌వర్గాలు దృష్టి సారించ నున్నాయి. త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ఈ వారం షేర్ల వారీగా కదలికలకు ప్రధాన కారణం కానుంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి. ఎన్రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్ మాట్లాడుతూ, క్యూ2ఫలితాలు ఐటీ షేర్లలో పుంజుకోవడానికి దోహదపడి, ప్రధాన సూచీలకు మద్దతునిచ్చాయని తెలిపారు. ముడి చమురు ధరలే ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థకు, మార్కె ట్లకు అతిపెద్ద స్థూల ఆర్థికపరమైన రిస్కో ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తంగా ఈ వారం భారత స్టాక్ మార్కెట్ల కదలికలను ప్రధానంగా నాలుగు అంశాలు ప్రభావితం చేయనున్నాయి కంపెనీల క్యూ2 ఫలితాలు ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్, ఇతర ప్రధాన రంగాల పనితీరు ద్రవ్యోల్బణ గణాంకాలు వాటి ఆధారంగా వడ్డీ రేట్లపై మారే అంచనాలు. విదేశీ పెట్టుబడులు కొనుగోళ్లు, అమ్మకాలు, రూపాయి మారకం విలు వలు ప్రభావితంచేస్తాయని తెలుస్తోంది.

# పండుగ సీజన్ షాపింగుల్లో ఇ-కామర్స్ సంస్థల జోరు

## తొలి రెండు రోజుల్లో రూ.24వేల కోట్ల విక్రయాలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** దేశంలోని ప్రముఖ ఇ-కామర్స్ మార్కెట్ సంస్థలు పండుగల షాపింగ్ సీజన్ ఘనంగా ప్రారంభించాయి. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరగడంతో తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ.24వేల కోట్ల విక్రయాలు నమోదయ్యాయని ఓ నివేదిక వెల్లడించింది. రెడ్సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదిక ప్రకారం. అమెజాన్, ఫ్లిప్కార్ట్, మీషో, అజియో వంటి ఆన్లైన్ ప్లాట్ఫామ్‌లు పండుగ సేల్స్ ప్రారంభమైన తొలి రెండు రోజుల్లో 2.5 బిలియన్ డాలర్లకు పైగా, అంటే సుమారు రూ.24,200 కోట్ల స్థూల సరుకుల విక్రయ విలువను నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా 89 కోట్ల ఆర్డర్లు నమోదయ్యాయని, సుమారు 66.5 కోట్ల మంది వినియోగదారులు ఈ షాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారని కన్సల్టెన్సీ అంచనా వేసింది. సాధారణ రోజుల్లో నమోదయ్యే సగటు రోజువారీ వ్యాపారంతో పోలిస్తే ఈ విక్రయాల విలువ దాదాపు ఆరు రెట్లు అధికంగా ఉంది. పండుగ సీజన్లో వినియోగదారులు ఎంత భారీగా ఖర్చు చేస్తున్నారో ఇది స్పష్టం చేస్తోంది. మొత్తం విక్రయాల్లో స్మార్ట్‌ఫోన్లు అతిపెద్ద వాటాతో ఉన్నాయి. మొత్తం జీఎంవీలో 38-40 శాతం వాటాతో ఈ విభాగం అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం విక్రయాల్లో ఈ విభాగం 25-27 శాతం వాటాను కలిగి ఉంది. ఫ్యాషన్ ఉత్పత్తులు మొత్తం విక్రయాల్లో 15-18 శాతం వాటాను సాధించాయి. తొలి రెండు రోజుల్లో ఈ విభాగంలో సుమారు రూ.363కోట్ల కోట్ల వ్యాపారం జరిగినట్లు నివేదిక పేర్కొంది. పెద్ద గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. టెలివిజన్ల విభాగంలో 55 అంగుళాల మోడళ్లకు అధిక డిమాండ్ కనిపించింది. టిసిఎల్, ఎల్జీ, శామ్సంగ్, షావోమీ వంటి బ్రాండ్లకు చెందిన మోడళ్ల టాప్ సెల్లింగ్ ఉత్పత్తుల్లో మూడొంతులకుపైగా వాటాను దక్కించుకున్నాయి. 2026 తొలి ఆరు నెలల్లోనే ఎలక్ట్రానిక్స్ విక్రయాలు 20 శాతానికి పైగా వృద్ధి సాధించాయని రెడ్సీర్ తెలిపింది. పండుగ సేల్స్ తొలి రెండు రోజుల్లో ఎలక్ట్రానిక్స్ ఆర్డర్లు సాధారణ రోజువారీ స్థాయితో పోలిస్తే దాదాపు 14 రెట్లు పెరిగాయి. ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్‌కు అనుసంధానమయ్యే స్మార్ట్ పరికరాలకు పెరిగిన డిమాండ్ ఈ వృద్ధికి ప్రధాన కారణమైంది. ఫ్యాషన్ ఉత్పత్తులు కూడా ఆన్లైన్ విక్రయాల వృద్ధికి కీలకంగా మారాయి. ఈ విభాగంలో స్థూల సరుకుల విక్రయ విలువ గత యేడాదితో పోలిస్తే 22-25 శాతం పెరిగింది.

# క్యూ2లో లాభాల వృద్ధి 10%కే పరిమితం

## జెఫరీస్ అంచనాలు




**ముంబయి, అక్టోబరు 11:** భారతకార్పొరేట్ రంగంలో మరో త్రైమాసికఆదాయాల జోరు షురూ అయింది రెండోత్రైమాసిక ఆర్థిక ఫలితాలను వెల్లడించేందుకు ప్రముఖ కంపెనీలు సిద్ధమవుతున్న వేళ, అంతర్జాతీయ పెట్టుబడి బ్రోకరేజ్ దిగ్గజం జెఫరీస్ సంచలన అంచనాలను విడుదల చేసింది. తమ కవరేజీ పరిధిలోని వైవిధ్యభరితమైన కంపెనీలు క్యూ2లో గతేడాదితో పోలిస్తే సగటున 16 శాతం బలమైన అమ్మకాల వృద్ధిని నమోదు చేసే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ముడిసరుకుల ధరలు, అంతరాయం కలిగిన సరఫరా గొలుసులు ఆపరేటింగ్ మార్జిన్లపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని, దీనికారణంగా నిర్వహణ లాభాల వృద్ధి కేవలం 10 శాతానికే పరిమితం కావచ్చునని హెచ్చరించింది. ఈ ఒత్తిళ్ల నడుమ కూడా అత్యుత్తమ వ్యాపార ప్రదర్శనతో పాలీక్యాబ్ ఇండియా, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా, విగార్డ్ ఇండస్ట్రీస్ షేర్లు మార్కెట్‌లో ప్రత్యేకంగా నిలు స్తాయని బ్రోకరేజ్ సంస్థ స్పష్టం చేసింది. పండుగ డిమాండ్, ప్రీమియమైజేషన్ ట్రెండ్ వల్ల కంపెనీల ఆదాయాలు పెరిగినప్పటికీ, నిర్వహణ లాభాల మార్జిన్లు యేటా 50 బేసిస్ పాయింట్లు తగ్గుతా యని జెఫరీస్ విశ్లేషించింది. కేబుల్స్, వైర్ల విభాగంలో అగ్రగామిగాఉన్న పాలీక్యాబ్ ఇండియా, గ్లోబల్ మార్కెట్లో రాగి ధరలు పెరిగినప్పటికీ ఆ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో సఫలమైంది. ఈ క్రమంలో పాలీక్యాబ్ రెండవ త్రైమాసికంలో 18 నుండి 20 శాతం అమ్మకాల వృద్ధిని సాధించవచ్చని, 13.5 శాతం ఆపరేటింగ్ మార్జిన్‌తో మెరుగైనస్థానంలోఉంటూ కీలక ఎంపి కగా నిలిచిందని నివేదిక పేర్కొంది. ఇదే విభాగంలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ సరఫరా పెరగడం వల్ల ఫినోలెక్స్ కేబుల్స్ కూడా సానుకూలవృద్ధిని కనబరు స్తుందని తెలిపింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగంలో గత యేడాది నాటి తక్కువ బేస్ ఆధా రంగా ఎయిర్‌కండిషనర్లడిమాండ్ భారీగా పుంజుకో వడంతో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా బలమైన పనితీరును కనబరిచేందుకు సిద్ధమైంది. సగటున 12శాతం అమ్మకాలవృద్ధితోపాటు పన్నుకు ముందు లాభాల్లో 18 శాతం పురోగతిని సాధించవచ్చని భావిస్తున్నారు. విగార్డ్ ఇండస్ట్రీస్ తన వైవిధ్యభరిత మైన ఉత్పత్తుల మిశ్రమంతో మెరుగైన రిస్క్‌రివార్డ్ ప్రొఫైల్‌ను అందిస్తోంది. విగార్డ్ యొక్క వన్‌ఇయర్ ఫార్వర్డ్ పిఇ నిష్పత్తి 28 రెట్లుగా ఉండగా, పాలీ క్యాబ్ 34 రెట్లు మరియు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ 47 రెట్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. అదే సమయంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ రంగంపై జెఫరీస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అధిక మెమరీ ఖర్చులు, బలహీనమైన వ్యయ పద్ధతులు, మునుపటి త్రైమాసికాల గరిష్ట స్థాయిల వల్ల ఈ రంగం లాభదాయకత దెబ్బతినవచ్చని పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.